# మాతృభాషే ఎందుకు?

– సింగమనేని నారాయణ

**మన** మాతృభాష తెలుగును గురించి ఇటీవలకాలంలో కొంత చర్చ జరుగుతూ వుంది. తెలుగుభాష ప్రమాదంలో పడిందనీ, భాషాభిమానులు తగిన శ్రద్ధ తీసుకోకపోతే, కొన్నేళ్ళకు తెలుగుభాష అనేది ఉండకపోవచ్చుననీ, ముఖ్యంగా విద్యారంగంలో, పాలనారంగంలో తెలుగుభాషపై ఆంగ్లభాష పెత్తనం మితిమీరి పోతోందనీ, మనం వింటూ వున్నాము. చదువుతూ వున్నాము. ఈ నేపథ్యంలో మనం మన మాతృభాషను గురించి తప్పనిసరిగా కొన్ని విషయాలు చర్చించుకోవాలి.

అసలు భాష అనేది ఎందుకు? భాష అనేది మానవుల సాంఘిక వ్యవహారానికి చాలా ముఖ్యమైన పనిముట్టు. భాష అనేదే లేకపోతే కొన్నివేల సంవత్సరాలుగా మానవజాతి సాధించిన నాగరికత, విజ్ఞానం, అభివృద్ధి ఈనాడు మనదాకా అంది వుండేవి కావు. సంఘజీవనంతోపాటు మానవజాతి సాధించుకున్న అమూల్యమైన సంపద భాష. ప్రపంచంలో భాషలేని మానవసమాజం మనకు ఎక్కడా కన్పించదు. భాషకూ, సమాజానికీ అనాదిగా విడదీయరాని సంబంధం వుంది. మనం ఇంతవరకూ చెప్పుకున్న భాష అనేది ప్రజలు మాట్లాడే భాషే. ప్రజలు మాట్లాడే భాష అంటే అది వాళ్ళ మాతృభాషే!

మాతృభాష అంటే తల్లిభాష. తల్లి దగ్గర నుండే తొలుత శిశువు భాషను నేర్చుకుంటాడు గాబట్టి, అన్ని భాషలవాళ్లూ తమ భాషను “మాతృభాష” అనే పేరుతోనే వ్యవహరిస్తూ వుంటారు. మనం మన నిత్యజీవితావసరాలకు చిన్నతనం నుండీ కూడా ఈ మాతృభాష మీదే ఆధారపడతాము. కుటుంబసభ్యులతో మనం మాట్లాడే భాష అంతా మాతృభాషలోనే. నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునేవరకూ అన్ని సందర్భాల్లోనూ, ఇంటా బయటా కూడా మనం మాతృభాషలోనే వ్యవహారాలు నడుపుతాము. ఏ మనిషీ కూడా తన మాతృభాషలో తప్పులు మాట్లాడడు. కర్త, కర్మ, క్రియ, కాలం, వచనం, లింగం – ఇలా అన్నింటినీ కూడా చాలా సహజంగా, తప్పులు లేకుండా, ప్రతి పిల్లవాడి నుండీ వృద్ధుని వరకూ మాట్లాడుతాడు. ‘నేను నిన్న అనంతపురం వెళ్లినాను’ అని అంటాడుగాని ‘నేను నిన్న అనంతపురం వెళ్తాను’ అని అనడు. ‘మేము నలుగురూ సినిమా చూశాం’ అని అంటాడుగాని ‘మేము నలుగురూ సినిమా చూశాను’ అని అనడు... ‘ఆమె బజారుకు వెళ్లింది’ అంటాడు గాని, ‘ఆమె బజారుకు వెళ్లాడు’ అని అనడు ‘అతడు అన్నం తిన్నాడు’ అని అంటాడు గాని ‘అన్నం అతన్ని తినింది’ అని అనడు. అంటే, కాలాన్నీ, వచనాన్నీ, లింగాన్నీ, కర్త, కర్మ, క్రియలనూ, మనం తప్పు లేకుండా చక్కగా నిత్యజీవితంలో ఉపయోగిస్తాము. ఇందుకు మనకు ఏ ఉపాధ్యాయుడు అక్కరలేదు. కర్త ఏకవచనంలో వుంటే క్రియ ఏకవచనంలోనే వుండాలి అని మనకు ఎవరూ బోధించనక్కరలేదు. కాలం వర్తమానం అయితే, క్రియ కూడా వర్తమానక్రియ అయివుండాలి అని మనకు ఏ వ్యాకరణశాస్త్రజ్ఞుడూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదు. ఎవరి బోధనలూ అవసరం లేకుండానే మనమంతా సవ్యంగా మాట్లాడుతాము. ఇందుకు కారణం మనం మాట్లాడేది మన మాతృభాషలో కాబట్టి. అదే మాతృభాషలో గొప్పతనం.

అదే పరాయిభాష అయితే, మనం ఎవరి దగ్గరో నేర్చుకుంటే తప్ప మాట్లాడడం కుదరదు. అదీ ఒక రోజులోనో, ఒక సంవత్సరంలోనో నేర్చుకుంటే కుదిరేదికాదు. **ఐ యామ్ గోయింగ్** అన్న మాటను ఇతరులపరంగా అయితే **హి యామ్ గోయింగ్** అని అంటే కుదరదు. ప్రతి చిన్నవిషయాన్ని కూడా వ్యాకరణశాస్త్ర సహాయంతో నేర్చుకోవాల్సిందే. తెలుగుభాషలో వాక్యనిర్మాణం. కర్త, కర్మ, క్రియల క్రమంలో ఉంటుంది. ఇంగ్లీషుభాషలో అలా కాదు, క్రియ మధ్యలోనూ కర్మ చివరిలోనూ వుంటుంది. ఉదా॥ **నేను స్కూలుకు వెళ్లినాను** అనే తెలుగు వాక్యం **నేను వెళ్లినాను స్కూల్‌కు** అని ఇంగ్లీషులో ఉంటుంది. మన వ్యాకరణ నియమాలకు పూర్తి భిన్నం ఆంగ్లభాష. అందువల్ల ఆ భాషను నేర్చుకోవటం లోనూ, మాట్లాడటంలోనూ, మనకు సౌలభ్యం సహజంగానే ఉండదు. అందుకే ఏళ్ళ తరబడి పరాయిభాష చదువుకున్నవాళ్లు కూడా ఆ భాషలో తప్పులే మాట్లాడటం మనం చూస్తుంటాము... ప్రతి వాక్యాన్నీ వెతుక్కుంటూ మాట్లాడటమూ, ధారాళంగా మాట్లాడలేక పోవటమూ, తన భావాన్ని స్పష్టంగా వ్యక్తం చెయ్యలేకపోవటమూ, ఇలాంటి ఎన్నో అసంగతాలను మనం చూస్తూ వుంటాము. మాతృభాషలోనయితే, అక్షరం ముక్క చదువుకోనివాడు కూడా, ధారాళంగా, స్పష్టంగా, తప్పులేకుండా, భావక్లిష్టత లేకుండా, అసలు భాషాస్పృహే లేకుండా మాట్లాడగలుగుతాడు. పరాయిభాషలో ఏ వందకు ఒక్కడో, వేయి మందికి ఒక్కడో, చక్కగా మాట్లాడగలవాడు వుండవచ్చుగాని, అధిక సంఖ్యాకులు ఇబ్బందిని అనుభవిస్తూనే వుంటారు. మాతృభాషలో అయితే ఈ ఇబ్బంది ఏ ఒక్కరికీ ఉండదు. అదే మాతృభాష గొప్పతనం.

## 2

**భాషకు** గల ప్రయోజనం మన మనసులోని భావాల్ని ఎదుటవారికి తెలియచెప్పటం మాత్రమే కాదు అంతకు మించిన ప్రయోజనాలూ, ప్రభావాలు, భాషకున్నాయి. భాషకు ఒక సామాజిక స్వభావం వుంటుంది. ఒక సాంస్కృతిక ప్రభావం వుంటుంది. మనిషికి తాను ఉపయోగించే భాషతో, తాను జీవిస్తున్న ప్రాంతానికీ, తనకు ఉనికినిస్తున్న సమాజానికీ, తనకు జీవికనిస్తున్న వృత్తి కార్యకలాపాలకూ, తన కాలం నాటి సంస్కృతీ సంయోజనకూ, సజీవమైన సంబంధాలుంటాయి. ఈ అన్నింటి నుండీ భాషకు మూలాలుంటాయి. ఇక్కడ భాష అంటే మాతృభాషే. పరాయిభాషతో ఈ సంబంధాలేమీ వుండవు. అంటే మాతృభాషలో మాత్రమే దేశీయ ముద్రకూ, సాంస్కృతిక వారసత్వానికీ విడదీయరాని అనుబంధం అనివార్యంగా ఏర్పడి వుంటుందన్నమాట. ఈ అన్నింటితో సంబంధంలేని పరాయిభాషలోకి ప్రవేశించడమంటే, విద్యార్థి తనకు తెలీకుండానే పరాయీకరణ చెందుతున్నాడన్నమాట. అందువల్లనే **ఇంగ్లీషు మీడియంలో చదివే విద్యార్థులు, తెలుగు మీడియంలో చదివే విద్యార్థుల్ని చిన్నచూపు చూస్తారు...** అంటే తన మాతృభాషను తానే చిన్నచూపు చూస్తాడనే గదా! ఈ చూపు ఇక అనేక విషయాల మీద ప్రభావం చూపుతుంది... **తన వారసత్వమూ, తన సాహిత్య సంప్రదాయాలు, తన జానపద సంస్కృతి, ఇలా అనేక విషయాల మీద తక్కువచూపు ఏర్పడే అవకాశముంది.** తనది కాని భాష మాట్లాడుతూ, తనది కాని జీవితాన్ని జీవించటానికి అలవాటుపడతాడు... అందుకే, బాల్యం నుండీ మాతృభాషామాధ్యమంలోనే విద్యార్థులకు విద్యాభ్యాసం జరగాలని నెత్తీనోరూ కొట్టుకొని మేధావులూ, సామాజికవేత్తలూ ఘోషిస్తున్నది.

ఇంగ్లీషు మీడియంలో చదవటం ఎందుకు గొప్పగా భావిస్తారంటే, ఆ భాష చాలా గొప్పభాష అనీ, ఆ భాష చదివితే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చుననీ, శాస్త్రవిజ్ఞానమంతా ఆ భాషలోనే ఉన్నదనే ఒక అభిప్రాయం, సమాజంలో అనేక కారణాలచేత స్థిరపడి వున్నది. తెలుగు మీడియంలో చదివినవాళ్లు కూపస్థ మండూకాల్లా వుండిపోతారనీ, ఆంధ్రదేశం దాటి బయటికి వెళ్ళలేరనీ గొప్ప గొప్ప చదువులు చదవలేరనీ, తెలుగులో శాస్త్రగ్రంథాలు లేవనీ, ఇలా రకరకాలుగా అభిప్రాయాలు వ్యాపించి వున్నాయి. ఇదంతా నిజమేనా? వాస్తవానికి ప్రపంచంలో ఏ భాష కూడా తక్కువ భాష కాదు. భాషాశాస్త్రం ప్రకారం భాషలన్నీ సమానమైన శక్తి కలిగినవే. ఏ భాషకు ఆ భాష గొప్పభాషే. కాకపోతే అభివృద్ధిలో కొన్ని తేడాలుండవచ్చు. ప్రపంచంలో ఇంగ్లీషే తెలియని దేశాలు చాలా వున్నాయి. రష్యాలో, చైనాలో, జపాన్‌లో, జర్మనీలో ఇలా చాలా దేశాల్లో ఇంగ్లీషు బోధనాభాషే కాదు. వాళ్ల మాతృభాషలే వాళ్ల బోధనాభాషలు. ఆ దేశాల విజ్ఞానాన్ని గాని, శాస్త్రసంపదనుగాని, సాహిత్యాన్నిగానీ ఎవరైనా తక్కువచూపు చూస్తున్నారా? అందువల్ల ఇంగ్లీషే ప్రపంచభాష అనుకోవటం; అంతా అందులోనే ఉంది అనుకోవటం కేవలం అమాయకత్వం. ఇంగ్లీషు చదివినవాళ్లే దేశాలు దాటి వెళ్తారని అనుకోవటం కూడా మరీ అమాయకత్వమే. వాళ్ల వాళ్ల మాతృభాషల్లో విద్యాభ్యాసం చేసిన వాళ్లలోనే అసంఖ్యాకులుగా శాస్త్రవేత్తలున్నారు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లున్నారు. విదేశాల్లో వివిధ శాఖల్లో కొలువు తీరినవారున్నారు. నిజానికి ఎక్కువగా ఉన్నది కూడా మాతృభాష బోధనాభాషగా గలవాళ్లే! **శాస్త్రగ్రంథాలు, తగినన్ని లేకపోవటమనేది తెలుగుభాష తప్పు కాదు. ఆ భాషలో ఆ పనిని చేయించని ప్రభుత్వాలది ఆ తప్పు.** నెపం భాష మీద మోపకూడదు.

మరెందుకు ఇంగ్లీషు మీడియం పట్ల ప్రజలు ఆకర్షితులౌతున్నారు? ఇంగ్లీషు మీడియం పాఠశాలలు ఎందుకు కుప్పతెప్పలుగా వెలుస్తున్నాయి? ప్రభుత్వం ఎందుకు పనిగట్టుకొని ఇలాంటి విద్యాలయాలను ప్రోత్సహిస్తున్నది. మాతృభాషపట్ల ప్రజల ఆసక్తి తగ్గటానికి కారణాలేమిటి? తెలుగును ఎందుకు తక్కువ చూపు చూస్తున్నాము? ఇవన్నీ చర్చించుకుంటే తప్ప వాస్తవమేమిటో తేలదు.

## 3

**మన** దేశాన్ని రెండువందల సంవత్సరాలపాటు, ఇంగ్లీషువాళ్లు పరిపాలించినారని చిన్న పిల్లలకు కూడా తెలుసు. వాళ్లు పరిపాలించే కాలంలో పాలనాసౌలభ్యం కోసం, సౌకర్యం కోసం తమ ఇంగ్లీషుభాషను ఇక్కడి ప్రజలపై బలవంతంగా రుద్దినారు. భాష పేరుతో కూడా వాళ్లు మనల్ని సులభంగా దోచుకున్నారు. 19వ శతాబ్దం చివరి నాటికే దేశంలో ఇంగ్లీషు భాషావ్యామోహాన్ని వాళ్లు ప్రజలలో పెంచినారు. గురజాడ రాసిన **కన్యాశుల్కం నాటకంలో గిరీశం ఇంగ్లీషులో నాలుగు ముక్కల్ని మాట్లాడి గౌరవస్థానం సంపాదించుకుంటాడు. ఆ భాష పేరుతో అమాయకుల్ని మోసం చేస్తాడు.** ఆ భాషను తన కడుపు నింపుకోవటానికి ఉపయోగించుకుంటాడు–సరే ఇంగ్లీషు వాళ్లు మన దేశంలో ఇప్పుడు లేరు. కాని ఇంగ్లీషు మాత్రం మిగిలింది **– ఇంగ్లీషుభాష పేరుతో అథారిటీ చెలాయించే ఒక వర్గం పెరిగింది. దేశభాషల స్థానంలో ఇంగ్లీషు పాలకభాషగా రూపాంతరం చెందింది.** ఇంగ్లీషుభాష ఉన్నతమైనదనే అభిప్రాయాన్ని ప్రజల్లో ఈ 50 ఏళ్లల్లో మరింత వ్యాప్తి చేశారు. ఆ కారణంగా ఆ భాషను వ్యాపారసాధనంగా, వ్యాపారవర్గాలు మలచుకొన్నాయి. ఇంగ్లీషు బోధనాభాషగా గల ప్రైవేటు పాఠశాలలు క్రమక్రమంగా పెరిగాయి. పట్టణాల నుండి పల్లెల దాకా ఇంగ్లీషు మీడియం పాఠశాలలు వ్యాపించాయి. **భాష కూడా వాణిజ్యసరుకు కావటం ఈ దేశంలో జరిగినట్టుగా బహుశా ఏ దేశంలోనూ జరిగి వుండదు.**

ఈ భాషావ్యాపారం సజావుగా సాగటానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో వుందని కూడా మనం జాగ్రత్తగా గమనిస్తే అర్థమవుతుంది. ఇంగ్లీషు మీడియం పాఠశాలలన్నీ కూడా ప్రైవేటు పాఠశాలలే అని మన అర్థం చేసుకుంటే ఈ రహస్యం మనకు బోధపడుతుంది. రాష్ట్రంలో వున్న అన్ని ప్రాథమిక పాఠశాలలు, సెకండరీ పాఠశాలలూ మొత్తం తెలుగు మీడియంలో అదీ ఉచిత విద్యాబోధనతో నడుస్తుండగా, ఇంగ్లీషు మీడియం పాఠశాలలన్నీ ప్రైవేటు పాఠశాలలే కావటం అంటే ఈ భాషావ్యాపారానికి ప్రభుత్వం మొత్తంగా లైసెన్స్ ఇచ్చిందనే గదా! దాదాపు ఈ ఇంగ్లీషు మీడియం ప్రైవేటు పాఠశాలలన్నిటికీ ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. **తనవిగాని పాఠశాల విద్యార్థుల కోసం ఇంగ్లీషు పాఠ్య పుస్తకాలు తానే తయారు చేసి సరఫరా చేయటం, తానే వాళ్లకు ఇంగ్లీషు ప్రశ్నపత్రాలు తయారుచేసి పరీక్షలు నిర్వహించటం, ర్యాంకులు ఇవ్వటం, ఇదంతా ఏమిటి?** తన నిర్వహణలో వున్న పాఠశాలలను పరోక్షంగా తానే నిరుత్సాహపరచడమే గదా! కోట్లకు కోట్లు ఖర్చుపెట్టి తాను నెలకొల్పిన పాఠశాలలనూ, వేలాది జీతాలతో తానే ఉద్యోగాలు ఇచ్చిన ఉపాధ్యాయులను తెలుగు మీడియం కారణంగా నిరుత్సాహపరుస్తూ ప్రైవేటు పాఠశాలల ఇంగ్లీషును ప్రోత్సహిస్తున్న కారణంగా, **మాతృభాష జవజీవాలు కోల్పోతుందని ఎందరు అర్థం చేసుకుంటున్నారు?** ప్రభుత్వం తాను మొత్తంగా పాఠశాలలను నిర్వహించే శక్తి లేనపుడు ప్రైవేటు పాఠశాలలకు అనుమతి ఇవ్వడంలో తప్పేమిటి అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. న్యాయమైన ప్రశ్న. అయితే తన ఆధీనంలోని పాఠశాలలు ఏ రూపంలో పనిచేస్తున్నాయో, అదే రూపంలో పనిచేయగలిగే విధంగా ఆంక్షలు రూపొందించి ఇస్తే ఏ

అభ్యంతరాలు ఉండవు. తన ఆధీనంలోని పాఠశాలలన్నీ తెలుగు మీడియంవీ. ప్రైవేటువన్నీ ఇంగ్లీషు మీడియంవీ. ఈ వివక్ష ఎందుకంటే, ప్రైవేటు యాజమాన్యాల వ్యాపారాన్ని ప్రోత్సహించటానికే! ఈ కారణంగానే **మన రాష్ట్రంలో ఇంగ్లీషు వ్యామోహాన్ని, ఇంగ్లీషు బానిసత్వాన్ని, మాతృభాషపట్ల నిరాదరణనూ, అలసత్వాన్ని, ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం పెంచి పోషిస్తోంది.** దాని దుష్ఫలితమే మనం ఇప్పుడనుభవిస్తున్నది. ఇంగ్లీషుభాషావ్యామోహానికి అసలైన కారణం ఇది.

సాధారణంగా ప్రజలు అమాయకులు. చాలామంది ఏ దారిన నడుస్తూ వుంటే ఆ దారిన నడవటానికే ఇష్టపడతారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షాఫలితాల శాతం తక్కువగా ఉండటమూ, అదీ చచ్చు తెలుగు మీడియం అనే ప్రచారాన్ని నమ్మటమూ, ప్రైవేటు ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చాలా మంచి ఫలితాలు వస్తున్నాయని భ్రమించి, క్రమక్రమంగా మోసపోతూ వస్తున్నారు. **చదువంటే, ఇంగ్లీషేననీ, చదువంటే ర్యాంకులేననీ, చదువంటే డాక్టర్లు, ఇంజనీర్లూ, ఎం.సి.ఏలూ అనీ, అమాయకంగా** నమ్మి బలైపోతున్న వాళ్ళు 90 శాతం పైగా ఉన్నారని ఎంతమందికి తెలుసు?

## 4

**గ్రామీణ**ప్రాంతాల్లోకి 'కాన్వెంట్ల' పేరుతో ఇంగ్లీషు మీడియం పాఠశాలలు ప్రవేశించటంవల్ల మాతృభాష పట్ల అవగాహనలేని పల్లెటూళ్ళవాళ్ళ చాలా నష్టపోతున్నారు. ఊళ్లో వున్న తెలుగుమీడియం ప్రాథమిక పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్చకుండా ఇలాంటి పాఠశాలల్లో కాన్వెంటు చదువులపట్ల వ్యామోహంతో చేరుస్తున్నారు. ఈ పాఠశాలలు నేర్పే ఎ,బి,సి,డిలకు, మమ్మీ, డాడీలకు చిలుకపలుకుల్లాంటి ఇంగ్లీషుపదాలకూ, ఒన్ టూ జార్ టూ లాంటి ఎక్కాలకూ మురిసిపోయి ఎంతో తొందరగా చదువు వచ్చేసిందని తెగ ముచ్చటపడిపోతుంటారు. తమ వూళ్లో వుండే ఎలిమెంటరీ స్కూల్‌కు పంపితే ఎన్నాళ్లయినా అక్షరం ముక్కలు రావటంలేదని కాన్వెంటుకు పంపిన మూడు నెలల్లోగా చదువంతా వచ్చేసిందని గొప్పలు చెప్పుకుంటూ వుంటారు. వాస్తవమేమిటంటే, ఇంగ్లీషు భాషకున్న అక్షరాలు కేవలం ఇరవై ఆరు. ఆ అక్షరాలకు దీర్ఘాలూ, ఒత్తులూ ఇలాంటివేమీ వుండవు. ఆ ఇరవైఆరు అక్షరాలనూ, వాటితో పాటు ఒక వంద ఇంగ్లీషు పదాలను నేర్పించడం చాలా సులభం. తెలుగు అలాకాదు, 56 అక్షరాలు, వాటికి దీర్ఘాలూ, ఒత్తులూ కలిపితే 1500కు పైగా అక్షరాలవుతాయి. ఇవన్నీ నెలా, రెండు నెలల్లో రావు. ఇవన్నీ నేర్చుకొని, ఒకటో తరగతి తెలుగువాచకం పూర్తి చేయటానికి సంవత్సరం పడుతుంది. ఇంగ్లీషు తొలి వాచకంలో వంద పదాలూ, సంఖ్యా వాచకాలూ, కొన్ని సంబంధ వాచకాలూ చిన్న చిన్న వాక్యాలూ ఉంటాయి. వీటిని నేర్పటం, నేర్వడం, సులభం – ఈ తేడా తెలియక ఇంగ్లీషు భాషంతా 3,4, నెలల్లోనే వచ్చేసిందని అమాయకులైన వల్లె ప్రజలు భ్రమపడిపోతూవుంటారు. ఈ భ్రమలే కాన్వెంట్లకు ఆయాచిత వరాలు. గ్రామీణుల ఈ అమాయకత్వమే కాన్వెంటుకు పెట్టుబడి – మాతృభాష పట్ల శ్రద్ధను తగ్గించి, ఇంగ్లీషు నూరిపోసి పోసి, పసిపిల్లల్ని ఘోరంగా మోసం చేస్తూంటాయి ఈ కాన్వెంట్లు.

ప్రమాదం ఎక్కడుందీ అంటే, ఈ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చివరిదాకా డబ్బులు పోసి చదివించే శక్తి గ్రామీణులకు లేకపోవటంలో వుంది. ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చదివించటమంటే చదువును కొనుక్కొవటమేకదా! చాలా మంది గ్రామీణ ప్రజలకు అంతశక్తి వుండదు. దాంతో ఈ పిల్లల చదువులు ఏ 6, 7 తరగతులకో ఠక్కున ఆగిపోతాయి. తమ వూళ్లో స్థానికంగా ఉండే, జిల్లా పరిషత్ హైస్కూళ్లలో, వీళ్లిక చదువుకోవటానికి వీలుండదు. ఈ హైస్కూళ్లలో ఉన్నది తెలుగు మీడియం. ఈ పిల్లలు చదువుకున్నది ఇంగ్లీషు మీడియం–ఇంగ్లీషు మీడియం చదువుల్ని కొనుక్కోలేక, తెలుగు మీడియం స్కూళ్లకు పనికిరాక, రెంటికీ చెడ్డ రేవడల్లాగా ఈ పిల్లల చదువు అర్థాంతరంగా ఆగిపోతుంది. అదే మొదటినుండీ, ఉచిత విద్యనందించే తెలుగు మీడియం స్కూళ్లల్లో ఈ పిల్లల్ని చదివించి వుంటే వీళ్ల చదువు నిరాటంకంగా సాగిపోతుంది. కాన్వెంట్ చదువుల వల్ల గ్రామీణప్రాంత విద్యార్థులకు జరుగుతున్న ద్రోహం ఇది. అందుకే మొదటి నుండీ అంటే ఒకటోతరగతి నుండీ మాతృభాషలో పిల్లలు చదివేలాగా అవగాహన కల్గించటం చాలా అవసరం! మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో!!

మనది చాలా పేద దేశం–70 శాతం పైగా గ్రామీణప్రాంతాలలో ప్రజలు నివసిస్తున్న దేశం–గ్రామీణప్రాంతాల్లో 70 శాతం పైనా పేద ప్రజలు జీవిస్తున్న దేశం –పేదరికం కారణంగా పిల్లల్ని చదివించటానికి శక్తిలేని గ్రామీణ ప్రజలున్న దేశం – చదువుల పట్ల భాష పట్ల అవగాహనలేని గ్రామీణ ప్రజలున్న దేశం. ఇలాంటి ప్రజలకు ఎలాంటి చదువులు కావాలి? ఏ భాషా చదువు కావాలి? డబ్బులు పెట్టి కొనుక్కునే ఇంగ్లీషు చదువులా? ఉచితవిద్యనందించే మాతృభాషా చదువులా? **చిలుకపలుకులు చెప్పి, గ్రామీణులను చదువు పేరుతో దోచుకునే ఇంగ్లీషు చదువులా, గ్రహణశక్తిని పెంపొందించి, విషయజ్ఞానాన్ని అతి తేలికగా అందిస్తూ ఉచిత విద్యనందించే, మాతృభాషా చదువులా?** మాతృభాషను నిరుత్సాహపరుస్తూ, లేని గొప్పల్ని ఆపాదించుకునే ఎండమావుల్లాంటి ఇంగ్లీషు చదువులా! తల్లి నుండీ, బయటి ప్రపంచం నుండీ, నిరంతరమూ ప్రవహించే జీవనదిలాంటి మాతృభాషా చదువులా? అసంఖ్యాక పేద ప్రజలున్న ఈ దేశ గ్రామీణులకు ఎలాంటి చదువులు కావాలి? నిస్సందేహంగా మాతృభాషా చదువులే కావాలి! కావాలి!

## 5

**గ్రామీణ**ప్రాంతాల్లోని పేద ప్రజలు, మాతృభాష పట్ల అవగాహన లేనందున, ఇంగ్లీషు కాన్వెంట్ల వ్యామోహంలోపడి నష్టపోతున్నారని చెప్పుకున్నాము కదా! ఈ వ్యామోహాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ముఖ్యంగా చదువుకున్న ఉద్యోగవర్గం ప్రోత్సహిస్తున్నది. మిడిమిడిజ్ఞానం గల మేధావివర్గం ప్రోత్సహిస్తున్నది. ఇంగ్లీషు రాకపోతే, భవిష్యత్తులో తమ పిల్లలేమైపోతారో అన్న భయాందోళనకు సామాన్య ప్రజలను ఈ శక్తులన్నీ గురిచేస్తున్నాయి. ఇంగ్లీషు మీడియంలో చదివితే తమ పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, గ్రూప్ 1 ఆఫీసర్లులాంటి పెద్ద పెద్ద ఉద్యోగాలు సంపాదించగలరనే భ్రమలోపడేలా సామాన్య ప్రజలను ఎన్నో శక్తులు తప్పుదారి పట్టిస్తున్నాయి. **ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నవాళ్లలో కూడా ఏ రెండు, మూడు శాతం మంది మాత్రమే ఈ పెద్ద ఉద్యోగాలలో ప్రవేశిస్తున్నారని చాలామందికి తెలియదు.**

అసలు చదువులంటే పెద్దపెద్ద ఉద్యోగాలేనా? డాక్టర్లు, ఇంజనీర్లూ ఆఫీసర్లు మాత్రమే ఉద్యోగస్తులా? మిగతావాళ్లు ఉద్యోగులు కారా? సమాజ అవసరాలను వీళ్ళు మాత్రమే తీరుస్తున్నారా ఉపాధ్యాయులు, గుమాస్తాలు, కండక్టర్లు, పోలీసులు, డ్రైవర్లు, విద్యుత్ హెల్పర్లు కార్మికులు, వీళ్లందరూ ఉద్యోగులు కాదా? వీళ్ళెవరూ లేకుండా సమాజం ముందుకు నడుస్తున్నదా? వీళ్లందరూ గౌరవంగా జీవించటంలేదా; వీళ్లకు భద్రత లేదా? ఇలాంటి విషయాలను ఆలోచించనివ్వని ఒక మిధ్యావిద్యావ్యవస్థ ఈనాడు

రూపుదిద్దుకోవటం ఇందుకు కారణం! ఉదాహరణకు, పదోతరగతిలో ర్యాంకులు సంపాదించుకున్న విద్యార్థుల మనోగతాల్ని, మనం పేపర్లో చూస్తున్నాం గదా? ఈ విద్యార్థులంతా ఏం చెబుతున్నారు! నేను డాక్టర్‌నవుతానని ఒక విద్యార్థి, ఇంజనీర్‌నవుతానని ఒక విద్యార్థి, విదేశాలకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఇంజనీరవుతానని మరో విద్యార్థి ఐ.ఎ.ఎస్ చేయాలని వుందని ఒకరూ, ఐ.పి.యస్. అని ఒకరూ, బిట్స్ అని ఒకరూ, పిలానీ అని ఒకరూ ఇలా తమ మనోగతాల్ని చెబితే, పేపరు వాళ్ళు వాటికి పెద్ద విలువలిచ్చి ప్రచారం చేయటం మనం చూస్తూనే ఉన్నాము కదా? ఏ ర్యాంకర్ విద్యార్థి ఐనా తాను టీచర్ అవుతాననీ, కండక్టర్‌నవుతాననీ, పోలీస్ అవుతాననీ అంటున్నాడా? అంటే ఏమిటి, ఇన్నిన్ని మార్కులు సంపాదించి ఈ వెధవ ఉద్యోగాలు చేయటానికా అన్న భావం ఇందులో స్ఫురించడంలేదా? ఆ పసిపిల్లల మెదళ్లలో ఈ ఉద్యోగ సంస్కృతి ఎలా ప్రవేశించింది? ఎవరు ప్రవేశపెట్టారు? అసలు లోపమంతా మన విద్యావ్యవస్థలో ఉంది. ఈ ర్యాంకరు విద్యార్థులంతా ఏ కార్పొరేట్ కళాశాలల్లోంచో బయటకు వచ్చి, **డబ్బుతో సమాజాన్ని అంచనాగట్టే స్థితికి తెస్తున్నదెవరు? ఇదంతా వ్యాపారప్రపంచంలో భాగమే!**

ఈ వ్యాపారప్రపంచమే ఇంగ్లీషును గొప్పగా చిత్రించి, మాతృభాషను అణగదొక్కుతున్నది. ఈ వ్యాపారప్రపంచానికి ప్రభుత్వం అండదండలు! ఇవన్నీ చూసి చూసి, చదివి చదివి, వినీ విని మాతృభాషా విద్యార్థులు ఆత్మన్యూనతలో పడిపోవటం లేదా? అందుకే ప్రజలంతా ఈనాడు తమ పిల్లల్ని ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చేర్పించటానికి ఉత్సాహపడుతున్నారు. నర్సరీ నుండి వేలకు వేలు తగలేస్తున్నారు. పిల్లల్ని వెంటాడి తరుముతున్నారు... అంతిమంగా అధిక సంఖ్యాకులు నష్టాలనూ, కష్టాలనూ చవి చూస్తున్నారు.

మాతృభాషా మీడియంకు దూరమైనందున, ఎందరు విద్యార్థులు, చదువులో వెనుకబడిపోతున్నారని ఎంతమంది గ్రహిస్తున్నారు? ఇంగ్లీషు మీడియం కారణంగా తమ సహజమైన గ్రహణశక్తీ, ప్రజ్ఞాపాటవాలూ వ్యక్తీకరణలూ, ఆలోచనలూ, దెబ్బతిన్నాయని తమ పసిపిల్లల గురించి ఎందరు తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు? తాము జీవిస్తున్న భాషా సమాజానికి భిన్నమైన భాషలో చదివే పిల్లలు భవిష్యత్తులో సామాజిక సాంస్కృతిక రంగాలలో భాగస్వాములు కాగలుతారా? అని ఎందరు ప్రశ్నించగలుగుతున్నారు? ఇంగ్లీషు మీడియం చదువులు కేవలం ఉద్యోగాలకే గురిపెట్టబడినప్పుడు, ఈ విద్యార్థులంతా, రేపు ఉద్యోగాల్లో చేరి తెలుగుభాషా ప్రజలతో ఎలా వ్యవహరించగలుగుతారు? అన్న దూరదృష్టితో ఎందరు ఆలోచించగలుగుతున్నారు? నిజానికివన్నీ సామాజిక సమస్యలు.

అందువల్ల, భాష కూడా ఒక సామాజిక సమస్యే అని మొదట మనం అర్థం చేసుకోవాలి. మనకున్న సమస్యలు చాలక ఇది కొత్తగా తెచ్చిపెట్టుకున్న, మనకు మనం కృత్రిమంగా సృష్టించుకున్న సామాజిక సమస్య కాదా? ప్రభుత్వం సృష్టించిన ఈ ప్రత్యామ్నాయ భాషావిధానం ప్రభుత్వానికే ఈనాడు పెనుసమస్యగా మారిపోయింది – ఇప్పటికే పట్టణాలలోని ప్రభుత్వ పాఠశాలలన్నీ ఎండిపోయినాయి. దాదాపు అనాథ విద్యార్థుల ఆశ్రమాలుగా మారిపోయినాయి. ఉదాహరణకు మా పట్టణంలో (అనంతపురం) 1960లో 1500 మంది విద్యార్థులున్న ఒక గవర్నమెంట్ హైస్కూల్‌లో ఇప్పుడు 300 మంది విద్యార్థులు కూడా లేరంటే, ఇది తనకు తానుగా ప్రభుత్వం తవ్వుకున్న గొయ్యి కాదా? ఇలాంటి పాఠశాలలు అన్ని పట్టణాలలో, ఆంధ్రదేశంనిండా వందలకు వందలున్నాయి. ఈ దుర్గతి గ్రామీణప్రాంత ప్రభుత్వ పాఠశాలలకు పట్టటానికి ఎంతో దూరంలేదు. సుమా! ఇదంతా కూడా మాతృభాషా నిరాదరణ వల్ల కలిగిన దుష్ఫలితమే.

# 6

**మనది** ప్రజాస్వామ్యమని చెప్పుకుంటున్న దేశం. ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్రే ఎక్కువ అని ఈనాడు కొత్తగా ఎవరూ పాఠాలు చెప్పవలసిన అవసరంలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రభుత్వానికి దాస్యులుగా ఉండకూడదు. ఆ మాటకొస్తే ప్రభుత్వమే ప్రజలకు దాస్యం చేయగలదిగా ఉండాలి. అంతిమంగా ప్రజల మాటే ప్రభుత్వాలకు శిరోధార్యం – ప్రజలకూ ప్రభుత్వాలకూ మధ్య దాపరికం ఉండకూడదు. ప్రజల మాట ప్రభుత్వానికీ, ప్రభుత్వం భావనలు ప్రజలకూ ఎప్పటికప్పుడు ప్రసారం అవుతూ వుండాలి – ఇందుకు వాహిక భాష! భాష అంటే ప్రజలభాషే! ప్రజలభాష అంటే మాతృభాషే!

ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వానికీ, ప్రభుత్వం అభిప్రాయాలు ప్రజలకూ, మాతృభాషలోనే వ్యక్తంకావాలి. అంటే ప్రజలభాషా, ప్రభుత్వంభాషా ఒకటిగానే ఉండాలి! అయితే ఇప్పుడా విధంగా ఉందా? లేదని ఎవర్నడిగినా చెబుతారు. ఇప్పుడు ప్రజలభాష వేరుగా, ప్రభుత్వంభాష వేరుగావుంది. ప్రజలభాష తెలుగు కాగా, పాలనాభాష ఇంగ్లీషు అని ఇప్పుడు అందరికీ తెలిసిన సత్యం. అయితే ప్రజలకూ, పాలకులకు మధ్య పెద్ద అడ్డంకిగా నిలుస్తున్నది. భాషే! అందువల్ల ప్రజలకూ, ప్రభుత్వాలకూ మధ్య సరియైన భావప్రసారం లేదు. ఆ కారణంగా పారదర్శకత లేదు. ప్రభుత్వం చేసే చట్టాలూ, ఉత్తర్వులూ, నియమ నిబంధనలూ కూడా, ఇలాంటివన్నీ కూడా ఈనాడు ఆంగ్లభాషలోనే ఉండటం మనం గమనిస్తున్నాము. అక్కడక్కడా కొద్దిగా సడలింపు ఉన్నా ప్రధానంగా పాలకవర్గాలభాష ఆంగ్లభాషే!

ఇందుకు కారణం మన అందరికీ తెలిసిందే! స్వాతంత్ర్యం రాక పూర్వం మన దేశాన్ని ఇంగ్లీషు వాళ్ళు పరిపాలించడం వల్ల వాళ్ల భాషే గతంలో పాలనాభాష అయింది. అయితే ప్రభుత్వాలు మారిపోయి అర్ధశతాబ్దం దాటిపోయింది. అయినా పాత పాలకుల భాష ఇంకా మన నెత్తిమీద పెత్తనం చేస్తూ వుంది. దీన్ని మార్చాలన్ని ఎప్పటికప్పుడు ప్రయత్నాలయితే జరుగుతూనే ఉన్నాయి కాని అమలులో మాత్రం ఇప్పటికీ అలసత్వం జరుగుతూనే ఉంది. పి.వి. నరసింహారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1972 నవంబరు 1వ తేదీ నుండి విధిగా ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని ఒక ఉత్తర్వు వచ్చింది. అయినా దాన్నెవరూ పట్టించుకున్న పుణ్యాన పోలేదు.

మిగతారంగాలు ఎలా వున్నా కనీసం విద్యారంగంలోనైనా దీన్ని అమలు చేస్తున్నారా? అంటే మనకు నవ్వు వస్తుంది. మీరు ఏ పాఠశాలకైనా వెళ్లండి. ప్రధానోపాధ్యాయుడు తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేసే ఒక పుస్తకం వుంటుంది. దాన్ని స్టాఫ్ ఆర్డర్ బుక్ అంటారు. ఆ పదానికి ఇంకా తెలుగుపదం పుట్టినట్టులేదు. ఆ పుస్తకంలోని ఆదేశాలన్నీ ఇంగ్లీషులోనే ఉంటాయి. ఉదాహరణకు చాలా చిన్న విషయం "రేపు దీపావళి పండుగ కావున పాఠశాలకు సెలవు" అన్న సాధారణమైన సులభమైన విషయాన్ని కూడా ఇంగ్లీషులోనే రాస్తారు. ఆ పాఠశాల మాతృభాష మీడియం పాఠశాలే! ఆ పాఠశాల నుండి పై ఆఫీసుకు వెళ్లే ప్రతిదీ కూడా ఇంగ్లీషులోనే ఉంటుంది. పై నుండీ వచ్చేది సరే సరి! తెలుగులో రాయొచ్చుగదా అంటే, "తెలుగులో కష్టమండీ, ఇంగ్లీషులోనే సులభంగా ఉంటుంది" అంటారు నిజానికి వీళ్లకు ఇంగ్లీషు కూడా రాదు. కొన్ని పడికట్టు వాక్యాలకూ, పదాలకూ, నమూనాలకూ అలవాటుపడి వుంటారు. దాన్నుంచీ బయటపడరు – ప్రధానోపాధ్యాయులకు తెలుగులో రాయాలంటే న్యూనతాభావం! **మన తెలుగు పట్ల మనకు న్యూనత! ఇంగ్లీషుపట్ల మిథ్యాగౌరవం!** విద్యాలయాల్లోనే ఇలాంటి పరిస్థితి వుంటే మిగతా

కార్యాలయాల గురించి చెప్పాల్సిన పనే లేదు. అన్ని ప్రభుత్వ ఉత్తర్వులూ ఇంగ్లీషులోనే ...వీటిని జి.ఓ.లు అంటారు. ఈ ఇంగ్లీషు జి.వోల గురించి ఇంగ్లీషు చదువుకున్న వాళ్లలోనే అనుమానాలూ, తర్జన, భర్జనలూ జరగటం మనం చూస్తూనే వుంటాము. పరాయిభాష కావటంవల్లనే ఈ అనుమానాలు.

అంటే ఇన్నేళ్లయినా పాలనారంగంలో మాతృభాషను ఉపయోగపెట్టుకోవటం మనం నేర్చుకోలేదన్నమాట... ఈనాడు పాలన అంతా ఆధునిక ప్రయోజనాలతో ముడిపెట్టబడి వుంది. ఆధునిక ప్రయోజనాలకు భాషను ఉపయోగపెట్టుకొనే కొద్దీ భాష కూడా ఆధునికమౌతుంది అని మనం ఇంతవరకూ గుర్తించలేకపోతున్నాము. ఉపయోగించటాన్ని ఒక పనిగా పెట్టుకుంటే, అది సులభతరమౌతుందనీ, అది సక్రమంగా పరిణామం చెందుతుందనీ మనం గ్రహించలేకపోతున్నాము ఇంగ్లీషు భాష ప్రయోజనాన్ని దానంతట అది తగ్గిపోయేలా మనం చూడాలి. మాతృభాష వల్ల పనిగట్టుకొని ప్రయోజనం సాధించాలి. ఎంతటి క్లిష్టమైన పాలనావిషయమైనా, మాతృభాషలో వ్యక్తీకరించటానికి అవసరమైన పదజాలం ఈనాడు సమృద్ధిగా వుంది. ప్రజలభాషకూ, పాలనాభాషకూ అంతరాలు పెరిగేకొద్దీ, ప్రజలు పరాయిపాలనలో తాము ఉన్నామన్న భావనను పెంపొందించుకుంటారు. **ఈ ప్రభుత్వము, ఈ అధికారులు, ఈ పరిపాలనా, ఇదంతా తమది కాదనీ, వీళ్లు తమ వాళ్లుకారనీ, భాష కారణంగా వేరుగా భావిస్తే ఇంతకంటే దౌర్భాగ్యం ఏముంటుంది.** అందుకే ఇప్పటికీ, ఓటువేసి ఎన్నుకున్న తమ ప్రభుత్వాలనూ, అధికారులనూ, ప్రజలు భయం భయంగా చూస్తున్నారు... ఈ భయానికీ, భాషకూ సంబంధం లేదా?

## 7

**మాతృభాష** నిరాదరణకు గురి అయిన ఫలితంగా, తెలుగులో మాట్లాడేవారిని తక్కువగా పరిగణించడమూ, ఇంగ్లీషులో మాట్లాడేవాళ్లను గొప్పగానూ, ఆరాధనగానూ చూడటమూ, మనం గమనిస్తూనే వున్నాము. 'నాకు తెలుగులో మాట్లాడటం సరిగా రాదండీ, ఇంగ్లీషులో అయితేనే చక్కగా నా అభిప్రాయాలు చెప్పగలను' అనే తెలుగు వాళ్లనూ మనం చూస్తూనే ఉన్నాము. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు 70 ఏళ్ళ క్రితమే ఇలాంటి వాళ్లను దెప్పిపొడుస్తూ 'స్వభాష' అనే చక్కని వ్యాసం ఒకటి 'సాక్షి' అనే తన పుస్తకంలో రాశారు. ఈ 70 ఏళ్లలో కూడా పరిస్థితిలో పెద్ద మార్పేమీ రాలేదు. కొన్ని సినిమాల్లోనయితే, కథానాయకుడో, లేదా కథానాయికో, ఏదో ఒక సందర్భంలో గడబిడా ఇంగ్లీషు మాట్లాడేసి, ఆ సినిమాలోని ఇతర పాత్రలతో పాటు ప్రేక్షకులను కూడా 'ధంగై' పోయేలా చేస్తారు. అబ్బా, ఈ 'హీరో' ఇంత గొప్పవాడా అని ప్రేక్షకులు ఉబ్బితబ్బిబ్బయిపోతారు. అంతవరకూ **ఆ హీరోను చులకనగా చూసిన ఇతర పాత్రలు అప్పటి నుండీ ఆ హీరోను చూసి జడుసుకుంటారు కూడా!** ఇలా ఇంగ్లీషుకు పట్టం కట్టేస్తున్నాం మనం! దేశీయభాషల పట్ల ప్రభుత్వం చూపుతున్న అలక్ష్యమే ఇందుకుగల మూలకారణం!

మాతృభాషలపట్ల ప్రేమనూ, ఆదరణనూ, అవసరాన్నీ చెప్పటం అంటే 'ఇంగ్లీషు భాషను ద్వేషించటం'గా మనం అపార్థం చేసుకోకూడదు. ఆ భాషకున్న స్థానం ఆ భాషకుంది. ఆ భాషను నేర్చుకోవటాన్ని ఎవరూ తప్పుపట్టకూడదు కూడా! ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మంచిది కూడా! అయితే మాతృభాషను చిన్నచూపు చూసే విధానాన్ని మాత్రమే మనం వ్యతిరేకించాలి. అలాగే మన భాషలోకి చేరిన ఇంగ్లీషుపదాల పట్ల కూడా వ్యతిరేకతగానీ, అసహనంగానీ ఉండకూడదు. ప్రపంచంలో ఏ భాష కూడా ఇతరభాషల సంపర్కంలేకుండా ఎదగదు. మన తెలుగులో సంస్కృతం, హిందీ, ఉర్దూ, పార్సీ, అరబ్బీ భాషల పదాలు వందలకు వందలు చేరివున్నాయి. ఇవన్నీ కూడా మన తెలుగుభాష ఎదగటానికి దోహదం చేశాయి. **భాష ఒక జీవనదిలాంటిది. నిల్వవున్న జలాశయంలాటిదికాదు. ప్రవహించే నది, తన ప్రవాహగమనంలో ఎన్నో వంకలనూ, వాగులనూ తనలో కలుపుకుంటూ మరింత విశాలమై ప్రవహిస్తుంది. భాష కూడా అలాంటిదే.** ఈ స్వభావాన్ని అర్థంచేసుకోలేని కొందరు 'వీర మాతృభాషావాదులు' తెలుగు వాక్యాలలో అక్కడక్కడా కన్పించే ఇంగ్లీషు పదాల వాడకాన్ని తప్పుపడుతున్నారు. ఇది భాషాద్వేషానికి దారితీస్తుందని వారు గుర్తించినట్టులేదు. భాష ఎప్పుడూ కృతకం కాదు... అది చాల సహజంగా జీవిస్తుంది. తెలుగుభాషలో వాడుకలో కలిసిపోయిన బస్సు, రైలు, బ్యాగు, కాఫీ, స్కూల్, గేటు, సినిమా, సైకిల్, పేపర్, రోడ్డు, స్టేషన్ ఇలాంటి కొన్ని వందలాది పదాలున్నాయి. వీటన్నింటినీ మనం తెలుగు పదాలుగానే స్వీకరించాలి. కొన్ని పదాలకయితే తెలుగు పదాలే దొరకవు. 'రేపు నాకు హైదరాబాదులో ఇంటర్వ్యూ వుంది'. అంటాము. ఇంటర్వ్యూకు బదులుగా ఏ తెలుగుపదం తెచ్చిపెట్టుకుంటాము? బలవంతంగా తెచ్చిపెట్టుకున్నా అది అతుకుతుందా? అర్థమవుతుందా? ఆఫీస్‌కెళ్లాలి అంటాము. ఆఫీసుకు 'కార్యాలయం' అనే పదంవుంది. కానిదాన్ని రాతలో తప్ప మాటలో ఎవరూ వాడరుకదా. 'కార్యాలయానికెళ్తున్నాను' అని ఎవరైనా అంటే పిచ్చివానిలా చూడరా? అలాగే అర్జెంట్, టీ.వీ., రేడియో, టైమ్ ఇలాంటివి ఎన్నో పదాలు మన భాషలో కలిసిపోయాయి. జనమంతా వాడుతున్నప్పుడు అది మన భాషాపదం కాకుండా పోతుందా? అందువల్ల, ఇంగ్లీషుపదాల వాడకం పట్ల మాతృభాషాభిమానం పేరుతో అసహనాన్నీ, వ్యతిరేకతనూ ప్రదర్శించకూడదు, తిలక్ అనే కవి 'సంస్కృతి' గురించి చెబుతూ ఇలా అంటాడు. **"ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిరబిందువు; నైకనదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు"** అంటాడు. ఈ మాట భాషకు కూడా వర్తిస్తుంది. మాట్లాడే వాక్యం తెలుగు వాక్యమైవుండాలి గాని, అందులో వాడే పరాయిభాషాపదాలపట్ల నిరసన వుండకూడదు. అప్పుడే భాష ఎదుగుతుంది. మనం మడిగట్టుకొని కూచుని వుంటే, నన్నయకు పూర్వం వుండే భాషే ఇప్పటికీ వుండేది. విజ్ఞానం విస్తరించే కొద్దీ భాష విస్తరిస్తుంది. ఆయా అవసరాల్ని బట్టి, ఇతర భాషాపదాల్ని తనలో కలుపుకుంటుంది. మన భావాల వ్యక్తీకరణ విశాలం చేసుకొనేందుకు, ఎన్నెన్నో పరాయి భాషాపదాలపై మనం ఆధారపడక తప్పదు. **మన భాషకున్న వాక్యనిర్మాణ సంప్రదాయాలలో అవి సహజంగా ఇమిడిపోతే అది మన భాషాపదమే అవుతుంది.** కొందరు తెచ్చిపెట్టుకొని, పదేపదే అనవసరంగా వాడే ఇంగ్లీషు పదాల వ్యామోహాన్ని ఇదే సందర్భంలో మనం తిరస్కరించాలి కూడా! అందుకే మాతృభాషావాదులైన వారెవరైనా పరాయిభాషలకు వ్యతిరేకులంకాదన్న స్పృహను కలిగివుండాలి.

## 8

**'మన** తెలుగుభాషను మనం కాపాడుకుందాం' అన్న విషయంలో భాషాభిమానులంతా ఏకాభిప్రాయంతో ఉన్నమాట మాత్రం వాస్తవం! అయితే ఇంగ్లీషు పదాల చొరబాటును సహించని వీరమాతృభాషాభిమానులున్నట్టే, మరోరకం సంప్రదాయ భాషావాదులు కూడా మనకు ఉన్నారు. ఇలాంటివాళ్ల దృష్టిలో తెలుగుభాష అంటే, పద్యభాషే, కావ్యభాషే, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే గ్రాంథికభాషే! ఇందుకు మనకు ఎన్నో నిదర్శనాలు కూడా కన్పిస్తున్నాయి. ఇటీవలకాలంలో జరిగిన కొన్ని మాతృభాషాసదస్సుల్లో, మన ప్రాచీన పద్యాలను గొంతెత్తి స్వరయుక్తంగా ఆలాపించటం, తెలుగుభాష అంటే

పద్యభాషే అన్నట్లుగా, పద్యభాషను హైలైట్ చేయటం మనకు కనిపిస్తూనేవుంది. వీరి పద్యభాషాభిమానాన్ని మనం తప్పుపట్టాల్సిన అవసరంలేదు. అయితే ఇందులో కూడా వీరు వీరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. నేను చూసిన కొన్ని సదస్సుల్లో పద్యం గాకుండా ఇతరమైన ఆధునిక కవుల గేయాల్ని ఆలపించటాన్ని వ్యతిరేకించటం, మొత్తంగా వీళ్ల వైఖరి చూసినపుడు భాషావరిణామాన్ని గురించి వీళ్ళకున్న అవగాహన సందేహాస్పదమనిపించింది.

భాషలో ఎన్ని మార్పులొచ్చినాయి? గ్రాంథికభాషను వదిలించుకోవటానికి వ్యావహారిక భాషోద్యమమే ఒకటి నడిచిందన్న విషయం మొదట మనం గుర్తించాలి. **ఆధునిక సమాజ అవసరాలను, ప్రయోజనాలను తీర్చటానికి గ్రాంథికభాష ఏ మాత్రం చాలదు** అన్న విషయం ఇప్పటికే నిరూపితమైపోయింది. ఈనాడు పత్రికల్లో వాడే భాష, రేడియో టి.వి.లాంటి ప్రసారమాధ్యమాల్లో వాడే భాష, ఆధునిక సాహిత్యంలో వాడే భాష, శాస్త్ర సాంకేతికరంగాల్లో వాడే భాష, విద్యార్థుల వాచకాల్లో వాడే భాష, మొత్తంగా ఆధునిక వ్యావహారిక భాషే! ఈనాడు మనం నేర్పాల్సింది, నేర్వాల్సింది, ఉపయోగపెట్టుకోవాల్సింది కూడా ఈ ఆధునిక వ్యావహారికభాషనే! అందువల్ల, పాలనారంగంలోకాని, బోధనా రంగంలోకాని మనం సూచించాల్సింది **ఈ వ్యావహారికభాషనే కాని గ్రాంథికభాషనూ, పద్యభాషనూ కాదు.** కాబట్టి మాతృభాషాభిమానులు ఈ విషయమై స్పష్టత కలిగివుండాలి. పద్యభాషను మనం తక్కువ చెయ్యాల్సిన అవసరం లేదు గాని, ఆ భాషకున్న పరిధి, పరిమితి, ప్రయోజనమూ చాలా తక్కువ అని మనం గ్రహించాలి. అందుకని పద్య కీర్తనలకు భాషాసదస్సులను ఉపయోగ పెట్టుకోకూడదు. అందుకు వేరే సాహిత్య సదస్సులుంటాయి. అది వేరే విషయం.

మన మాతృభాష అంటే ప్రజలు మాట్లాడే తెలుగుభాష. ప్రజలకు అర్థమయ్యే తెలుగుభాష. ప్రజల ప్రయోజనాలు తీర్చే తెలుగుభాష! అందుకే అధిక సంఖ్యాకులైన ప్రజలకోసం మనం తెలుగును బోధనాభాషగా, పాలనాభాషగా కోరుకుంటున్నాము... ఇంగ్లీషుభాషను ఒక భాషగా మనం వ్యతిరేకించడంలేదు. మాతృభాష మీద చేసే పెత్తనాన్ని మాత్రమే మనం కాదంటున్నాము. **దేశీయ భాషల అభివృద్ధికి ఆటంకంగా పరాయిభాషకు సంక్రమించిన అధికారాన్ని మాత్రమే మనం తృణీకరిస్తున్నాము.** అందువల్ల అన్ని రంగాలలో, మాతృభాష అయిన తెలుగు అమలును మనం కోరుకుంటున్నాము.

మనం తెలుగు ప్రజలం. మన భాషను మనం ప్రేమించడం అనేది ఒక మౌలిక బాధ్యత. ఒక సాంస్కృతిక అవసరం. ఒక సాంప్రదాయక అవసరం. ప్రజలు మాట్లాడే తెలుగుభాషను పనిగట్టుకొని ఎవరూ బతికించాల్సిన అవసరంలేదు. దానికొచ్చిన ప్రమాదమేమీ లేదు...ఎటొచ్చీ బోధనారంగంలోనే ప్రమాదం విస్తరిస్తూవుంది. విద్యార్థి మాతృభాషను నేర్వలేకపోతే జీవితంలో చాలా అందాల్ని ఆనందాల్నీ అవసరాల్నీ కోల్పోతాడు – భాష చుట్టూ ఒక సాంస్కృతిక భావజాలం అల్లుకొని వుంటుంది. సంస్కృతం గొప్పదనే వారి భావజాలం వేరుగా వుంటుంది. ఇంగ్లీషు గొప్పదనే వారి భావజాలం వేరుగా వుంటుంది. **మాతృభాష పట్ల ఆసక్తి, ఆదరణ, అభినివేశం గల వారి భావజాలం దేశీయమై ఉంటుంది.** మాతృభాష నేర్వకపోతే మన సంస్కృతిని ఆనందించలేము. మన సాహిత్యం సొగసులను ఆస్వాదించలేము. మన పద్యం, మన గేయం, మన కథ, మన చరిత్ర వీటికి సంబంధించిన అభ్యాసనానికి దూరమౌతాము – మన సామెతలను, హాస్యోక్తులను, చతురోక్తులను, నానుడులను, లోకోక్తులను అనుభవించలేము. ఆనందించలేము. మన జానపదగేయ ఫణితులను, వాటిలోని వ్యంగ్యాన్నీ ధ్వనినీ పసిగట్టలేము. **మన నేలమీద మనం పరాయివారిగా జీవించే భావజాలాన్ని పెంపొందించుకుంటాము.** అందుకే ప్రతి విద్యార్థినీ మాతృభాషాభ్యాసన ఆసక్తులుగా చేయటం పెద్దల బాధ్యత, తల్లిదండ్రుల బాధ్యత – మేధావుల, సామాజికుల బాధ్యత!

నిర్దిష్టమైన స్థల కాలాలతోపాటు, నిర్దిష్టమైన భాష కూడా జీవితాన్ని ప్రతిబింబించే సాధనాలలో ఒకటి. **భాషకు ఒక 'నుడికారపు వాస్తవికత' ఉంటుంది.** అది మాతృభాష ద్వారానే సాధ్యమౌతుంది. అందుకే అతి ప్రాథమిక స్థాయి నుండీ కనీసం **10వ తరగతి దాకా అన్ని పాఠశాలల్లోకూడా నిర్బంధంగా మాతృభాషలో విద్యాబోధన సాగేలా చూడటం** ప్రభుత్వపు కనీస బాధ్యత. అందుకు భాషావాదులందరూ ఒత్తిడి పెంచాలి! తెలుగును అధికారభాషగా అమలుపరచటానికి చొరవ చూపాలి!

**ఆకాశవాణి అనంతపురం సౌజన్యంతో**

**('ప్రజాసాహితి' నవంబరు 2003 నుండి మార్చి 2004**
**(సంచికలు 257 నుండి 261 వరకు)**

# మాతృభాషామాధ్యమమే ఎందుకు?

## (ప్రసంగం)

– సింగమనేని నారాయణ

**బోధనారంగంలో** మాతృభాషామాధ్యమమే ఎందుకు? ఇక్కడున్న సభికులందర్నీ ఒక ప్రశ్న వేస్తాను. ఇక్కడున్న సభికులలో ఆంగ్లభాషామాధ్యమంలో ఫస్ట్ క్లాస్ నుండి చదువుకున్న వాళ్ళు ఎవరైనా ఉన్నారా? విద్యార్థులు కావచ్చు. పెద్దలు కావచ్చు. మీరెవరైనా కావచ్చు. ఆంగ్లభాషామాధ్యమంలో మొత్తం విద్యాభ్యాసం పూర్తి చేసినవారు ఎవరైనా ఈ సభలో ఉన్నారా? ఉంటే ఒక రెండు మూడు శాతం ఉండవచ్చు. ఎందుకంటే ఆంగ్లభాషామాధ్యమంలో చదివినవారు ఇక్కడికి రారు. మీరు 50 మంది ఉన్న సభలో విచారించండి. ఆంగ్లభాషామాధ్యమం ఉన్నవారెవరైనా సభలో ఉన్నారేమో? ఒక 100 మంది ఉన్న సభలో, ఒక 1000 మంది ఉన్న సభలో కూడా ఉండరు. లేకపోవడంలో ఆశ్చర్యం ఉండదు. ఎందుకుండదు? వాళ్లు ఆంధ్రభాషామాధ్యమ విద్యార్థులు కాబట్టి. మీరంతా ఎందుకున్నారు? మాతృభాషామాధ్యమంలో చదువుకున్నారు కాబట్టి మీరున్నారు. ఆంగ్లభాషామాధ్యమంలో మొత్తం చదువు చదివినవాళ్లు ప్రజాసముహాలకు, ప్రజా బాహుళ్యాలకు, ప్రజాసంఘాలకు, ప్రజాసమస్యలకు దూరంగా ఉంటారు. మీరు జాగ్రత్తగా గమనించండి. పదిమంది ఒక చోట చేరిన ఏ చిన్న కూటమిలోనూ ఆంగ్లభాషామాధ్యమ విద్యార్థులు ఉండరు. చాలా తక్కువశాతం ఉంటారు. ఎందుకంటే ఆంగ్లభాషకు ప్రజాసమూహాలను విడగొట్టే స్వభావం వుంది. ప్రతి భాషకు భావజాలం ఉంటుంది. ఆంగ్ల భాష గొప్పది అనే వాళ్లలో ఆధిపత్య భావజాలం ఉంటుంది. మాతృభాష గొప్పది అనే వాళ్లలో ప్రజాస్వామిక భావజాలం ఉంటుంది. సంస్కృతభాష గొప్పది అనే వాళ్లలో చాదస్త భావజాలం ఉంటుంది. మనం భాషను కేవలం భాషాదృష్టితో మాత్రమే చూడకుండా భావజాలం దృష్టితో కూడా చూడవలసి వుంటుంది. భావజాలానికి మానవీయ సంబంధాలకు చాలా దగ్గర సంబంధం ఉంటుంది.

ఆ కారణం చేతనే ఆంగ్ల భాషామాధ్యమం ఈ రోజు ప్రజలను ఎందుకు విడగొడుతుందో దానికి కారణాలేమిటో కూడా జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి. మీరు ఏ విద్యార్థి సంఘాలనైనా చూడండి. ఎఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,ఎబివిపి, ఎన్ఎస్యుఐ – ఏ ఒక్క సంఘమైనా, రచయితల సంఘాలు కావచ్చు. కార్మికసంఘాలు కావచ్చు. యువజన సంఘాలు కావచ్చు, ఏవైనా సంఘాలు చూడండి. ఆ సంఘంలో ఆంగ్లభాషా మాధ్యమంలో చదువుకున్న వాళ్లెవరూ ఉండరు. ఈ విడిపోవడమనే పరిస్థితి, ప్రజాబాహుళ్యాలకు దూరంగా ఉండడమనే పరిస్థితి, సమూహాలకు దూరంగా ఉండడమనే పరిస్థితి, సమస్యలకు దూరంగా ఉండడమనే పరిస్థితి, ఇది ఇలాగే కొనసాగితే రేపు ప్రజాసంఘాలుండవు. ప్రజాసంఘాలు ఆధారంగా జీవిస్తున్న రాజకీయపార్టీలు ఉండవు. కమ్యూనిస్టు పార్టీలు ఉండవు. 20–25 సంవత్సరాల తర్వాత మీటింగ్ పెడితే ఒక్కరుండరు. ఎందుకంటే అప్పటికి మాతృభాషామాధ్యమ పాఠశాలలు అంతరించిపోయి వుంటాయి. గమనిస్తున్నారా మీరు? ఈ సంవత్సరం 7,000 మాతృభాషామాధ్యమ పాఠశాలలు మూసివేశారు. గత సంవత్సరం రెండు వేల మాతృభాషామాధ్యమ పాఠశాలలను ప్రభుత్వం మూసివేసింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 15–20 ఏళ్ళ తర్వాత ఈ దేశంలో మాతృభాషమాధ్యమ పాఠశాలలు ఉండనే ఉండవు. ఏమవుతుందప్పుడు? అంటే ఎవరికి వారు తమ సౌలభ్యాల వలయాన్ని సృష్టించుకోవడానికి మాత్రమే మిగులుతారు. అందువల్ల 20 ఏళ్ళ తర్వాత కమ్యూనిస్టుపార్టీలకు ప్రజాసంఘాలుండవు. ఇప్పుడు కమ్యూనిస్టుపార్టీలకు సంబంధించిన ఉదాహరణ చెబుతున్నాను. అగ్రనాయకుల పిల్లలందరూ అమెరికాలో చదువుకుంటున్నారు. కార్యకర్తల పిల్లలందరూ కాన్వెంట్‌లలో చదువుకుంటున్నారు. కమ్యూనిస్టుపార్టీ నాయకులకు, కార్యకర్తలకు రేపు వారసులెవరు? వాళ్ల ఆకలిపోరాటం గురించి వినేదెవరు? ఏం ఎందుకిలా జరుగుతున్నది?

కేవలం మాతృభాషామాధ్యమాన్ని మందగింపజేయటం వల్లనే, ఊహించడానికి వీలుగాని భయంకర పరిణామాలు జరుగుతాయి. ఈ పది సంవత్సరాలకాలంలో ఇంతటి అన్యాయమైన పరిస్థితిని ఎవరు సృష్టించారు? నేను ఆంగ్లభాషపై వ్యతిరేకతతో మాట్లాడడం లేదు. ఏ భాషనైనా వ్యతిరేకించడం చాలా ఘోరం. ఏ భాషను కూడా ఎవ్వరూ ద్వేషించకూడదని చెబుతున్నాను. **మాతృభాషావాదులు కూడా ఆంగ్లభాషను ద్వేషించకండి. అన్ని భాషలు నేర్చుకోండి. భాషాద్వేషం చాలా అనర్థదాయకం. ఆంగ్లభాషా మాధ్యమాన్ని మాత్రమే మనం ద్వేషిస్తాం,** దేశీయ భాషల మీద పెత్తనం చేస్తున్న ఆంగ్లభాషా మాధ్యమాన్ని మాత్రమే ద్వేషిస్తాం. ఆ స్థితికి ఆంగ్లభాషా మాధ్యమాన్ని తెచ్చిన పాలకవర్గాలను ఈ 60 ఏళ్ళలో ఏంచేశాం? భాషాప్రయుక్తరాష్ట్రాల ఏర్పాటు వెనుక మౌలిక ఉద్దేశ్యం ఏమిటి, మౌలిక స్వభావం ఏమిటి? అంతకు మునుపు 200 సంవత్సరాల పైబడి **ఆంగ్లభాషామాధ్యమం పెరిగిపోయి దేశీయభాషలు, దేశీయసంస్కృతి**

**సర్వనాశనమై పోగా మళ్ళీ మన భాషను, మన దేశీయవిద్యను, మన దేశీయసంస్కృతిని, పునరుద్ధరించుకుందామనే మౌలికమైన ఉద్దేశ్యంతో భాషాప్రయుక్తరాష్ట్రాలు ఏర్పడ్డాయి.**

ప్రపంచంలో ఎక్కడైనా భాష పేరుతో రాష్ట్రాలు ఏర్పడ్డాయా? ప్రపంచంలో భాషల పేరుతో రాష్ట్రాలు ఒక్క భారతదేశంలోనే ఎందుకు ఏర్పడ్డాయి. ఇక్కడ దేశీయ భాషలను రక్షించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఏర్పడ్డాయి. ఇక్కడ మాతృభాషను మళ్ళీ కాపాడుకోవాలన్న ఉద్దేశ్యంతో ఏర్పడ్డాయి. అయితే ఈ 60 ఏళ్లలో ఏం జరిగింది? ముందుకంటే భయంకరంగా బోధనారంగంలోనూ, పాలనారంగంలోను, వాణిజ్య రంగంలోను ఆంగ్లభాషాపెత్తనాన్ని మోసి మోసి చివరికి ఈ పరిస్థితికి వచ్చాం రేపటికి ఏమవుతుంది. ఆంగ్లభాషామాధ్యమం చాలా ఆకస్మికంగా వచ్చిన పరిణామం అనుకోకండి.

మీరు ప్రపంచీకరణ అనే పేరు వినే ఉంటారు. 'సామ్రాజ్యవాద ప్రపంచీకరణ', 'మార్కెట్' అనే పేర్లు కూడా మీరు విని ఉంటారు. **ప్రపంచీకరణ అనేది ఒక పెనుసంత. పెద్ద మార్కెట్. ఈ మార్కెట్ కొక భావజాలముంది. తన కంటబడిన వాళ్లనందరినీ కూడా స్వాధీనం చేసుకోవడం ఈ మార్కెట్ దీర్ఘలక్ష్యం. అది లక్ష్యం సాధించుకోవాలంటే ప్రపంచం మొత్తంలోని మానవ స్వభావాలన్నిట్నీ కూడా తన వైపు తిప్పుకోవాలి. అందుకు దేశీయభాషల్ని నాశనం చేయాలి. సంస్కృతిని నాశనం చేయాలి. ఆచార వ్యవహారాల్ని తిండిని నాశనం చేయాలి.** అలా చేసినప్పుడు మాత్రమే మార్కెట్లు – అందరిళ్ళల్లోకి, అందరి వీధుల్లోకి, అందరి బెడ్‌రూముల్లోకి ప్రవేశిస్తాయి. అందుకే అన్నీ మార్కెట్,భాష మార్కెటైజ్డ్ అందుకే. ఈరోజు ఇంగ్లీషు మార్కెట్ భాష. వంద సంవత్సరాల క్రితమే గురజాడ 'కన్యాశుల్కం' నాటకములో ఇప్పటి భాషామార్కెట్‌కు సంబంధించిన కాన్వెంట్లకూ, కార్పొరేట్ హైస్కూళ్ళకూ నమూనాలాంటి గిరీశం అనే పాత్రను సృష్టించాడు. ఆ నాటకంలో గిరీశం నాలుగింగ్లీషు మాటల్ని వెంకటేశం అనే శిష్యునికి నేర్పించాలనే ఉద్దేశ్యంతో వాళ్ళింటికెళ్ళి ఇంగ్లీషులో మాట్లాడుతున్నట్లు నాటకమాడతాడు – 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' అని గిరీశం అంటే "దేరీజ్ ఎ వైట్ మ్యాన్ ఇన్ ది టెంట్" అని వెంకటేశం అంటాడు. వాళ్ళిద్దరి మాటల మధ్య సంబంధమే లేదు. వాళ్ళ సంభాషణకు ఆ ఇంట్లో వాళ్లందరూ దంగైపోతారు. **ఆంగ్లభాషకు దంగైపోవడం నూరేళ్ళ కిందట 'కన్యాశుల్కం' నాటకంలో గిరీశం చూపిస్తే ఇదుగో ఆ గిరీశమే ఇప్పటి కార్పొరేట్ కళాశాలల, హైస్కూళ్ళ ప్రతిరూపం.** అంటే ఒక భాషను ఒక వర్తకపు సరుకుగా, ఒక మార్కెట్ వస్తువుగా గుర్తించి, దానికి లేని రంగులు అద్ది **ఇంగ్లీషుభాష నేర్చుకుంటే తప్ప ఈ జాతికి భవిష్యత్ లేదని, బతుకులేదనే భావజాలాన్ని ఎవరు సృష్టించారు?**

నాలుగు వారాలు వరుసగా ఫెయిర్ అండ్ లవ్లీ రాసుకుంటే నల్లగా ఉన్నవాళ్లు తెల్లగా అవుతారన్న ఒక ప్రకటన ఉంది. 40 ఏళ్లుగా ఆ ప్రకటన చూస్తున్నాం. ఆ ఫెయిర్ అండ్ లవ్లీని 40 ఏళ్లుగా వాడుతున్న వాళ్లెవ్వరూ ఎర్రబడలేదు. అది ఎంత మోసపూరితమో ఆంగ్లభాష గొప్పతనాన్ని గురించి అన్ని సంస్థలు విపరీత ప్రచారం చేసుకోవడం కూడా అంతే. అయ్యా! దీని వల్ల ఖచ్చితంగా 10–15 సంవత్సరాలలో ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమ పాఠశాలలుండనే ఉండవు. మేం చాలా వరకు సర్వే చేశాం **ఆంగ్ల పాఠశాలలకు ప్రామాణికత లేకపోయినా ఎప్పుడైతే ప్రభుత్వ లైసెన్సు లిచ్చిందో అప్పుడే జాతి సర్వనాశనమైంది.** 50 సంవత్సరాలు దేశాన్ని పాలించిన పాలకపక్షాన్ని నిందించాలి మనం. ఎన్ని దుష్ఫలితాలు మనం అనుభవించబోతున్నామో చూడండి మీరు. ఒక పదేళ్ళ తరువాత గ్రామీణప్రాంతాల్లో చదువుండదండీ. డబ్బుంటేనే విద్య, డబ్బుంటేనే వివాహం, డబ్బుంటేనే ఉద్యోగం, డబ్బుంటేనే ఉపాధి. అంతా మార్కెటింగ్ చేసేసి, మొత్తం ధనస్వామ్యమయంచేసి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులు బిసి, ఎస్సీ,ఎస్టీ, నిమ్నమైనార్టీలకు ఏ విద్యను అందిస్తావు? కొన్ని వేల మందిని వీధివీధిని కలిపి నరికి పారవేసేట్టున్నారు! 20 ఏళ్ళలో ఎన్ని దుష్పరిణామాలొచ్చాయో ఒకసారి గమనించారా?

ఏ మునిసిపల్ స్కూల్లోకైనా వెళ్లి చూడండి. అక్కడ ఇవాళ అనాథలైన వాళ్ళున్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీలున్నారు. తిండికి కరువైనవారున్నారు – అనాథాశ్రమాలుగా, అనాథ పాఠశాలలుగా ఉంటే రేపేమౌతుంది? ఎంతమంది డబ్బులిచ్చి చదువు కొనగలుగుతారు? చాలా జాగ్రత్తగా ఆలోచించండి.ఇప్పుడు చాలామంది ఇద్దరు పిల్లలకే, ఎందుకు పరిమితమవుతున్నారు? నలుగుర్ని కనడానికి ఎందుకు భయపడుతున్నారు. చదువు కోసమేనండి. **ప్రతి తల్లి, తండ్రి సమస్తాన్ని జీవనోత్సాహాన్ని నాశనం చేసుకొంటే తప్ప పిల్లలు వృద్ధిలోకి రారు. అందుకే ఈరోజు తల్లితండ్రులు ఎవ్వరు పిల్లలను లాలించడంలేదు. వాళ్ళ ఖర్చును భరిస్తున్నారంతే.** వాడు పుట్టినప్పటి నుంచి ఖర్చు మీదే గణాంకాలు. దాని దుష్ఫలితాలు ఎంతో ప్రమాదంగా ఉంటాయి.

ఆంగ్లమాధ్యమంలో చదువు చదివిన వాడెవ్వడూ కూడా ఏం కావాలనుకుంటాడు? డాక్టర్ కావాలనుకుంటాడు. ఇంజనీర్ కావాలనుకుంటాడు. ఎం.బి.ఏ., ఎం.సి.ఏ., కావాలనుకుంటాడు. గ్రూప్–1 ఆఫీసర్ కావాలనుకుంటాడు. బిట్స్ పిలానీ కావాలను కుంటాడు. అంతేగాని కండక్టర్, డ్రైవర్, గుమాస్తా, కానిస్టేబుల్, హెల్పర్, టీచర్ కావాలనుకుంటాడా? అనుకోడు. ఎందుకంటే ఆంగ్ల భాషాధిపత్యమనేది వాడి మైండ్‌లో పడిపోయి, తనకు తాను అత్యున్నతునిగా ఊహించుకోవడం వలన, తల్లిదండ్రులు ఖర్చుపెట్టిన లక్షలాది రూపాయల్ని తలచుకొని వాడేమౌతాడు. ఏమీ కాడు, బికారి అవుతాడు. సంవత్సరానికి 2 లక్షల మంది ఇంజనీర్లు ఒక్క ఆంధ్రదేశంలో తయారవు తున్నారు. ఆ విధంగా పదేండ్లకు 20 లక్షల మందౌతారు. అప్పుడు వాడు బఠానీలు అమ్ముకోడానికి కూడా పనికిరాడు. కాని మాతృభాషామాధ్యమంలో ఉన్నవాడు మహనీయుడవుతాడు! సిగ్గుపడకుండా టీచర్ అవ్వాలనుకుంటాడు. కండక్టర్, గుమాస్తా, హెల్పర్, ఏదైనా కావాలనుకుంటాడు. ఏ పనైనా చేయడానికి ఇష్టపడతాడు, మాతృభాషామాధ్యమ విద్యార్థి. ఆ భాషకున్న ప్రజాస్వామ్య భావజాలమే అందుకు కారణం. ఒక ప్రజాస్వామ్య భావజాలాన్ని, ఒక మానవీయసంబంధ భావజాలాన్ని, నలుగుర్ని ఒకచోట కలిపేటటువంటి భావజాలాన్నందించేటటువంటి మాతృభాషామాధ్యమాన్ని మొత్తం నరికి వేస్తుంటివి. మొత్తం వ్యాపారమయం చేసి, వచ్చేతరానికేం సమాధానం చెప్తావ్? వచ్చేతరానికి మనం ఏం సందేశం ఇస్తాం? ఎంతో మంది అనాథలైన గ్రామీణప్రాంతాల్లో ఉండే పిల్లల్ని చూస్తుంటే వొణుకొస్తుంది.

ఇంగ్లీషుకు 26 అక్షరాలుంటం వల్ల 4 రోజుల్లో నేర్చుకుంటారు. నాలుగు వాక్యాలు నేర్చుకొని మధ్యలో బడి మానేస్తే వాళ్ల గతేం కాను. తెలుగూ రాక ఇంగ్లీషూ రాక రెంటికి చెడిన రేవడిగా అవుతారు. ఇటువంటి బడిమానిన వారు 70 శాతం వున్నారు.

మనం నీటి వనరులను కాపాడి భవిష్యత్తరాలకు ఎంత జాగ్రత్తగా అందించాలో తెలుగు భాషావనరులను కూడా అంతే భద్రంగా కాపాడి వారికి అందించాలి. అందుకే **ఈ పరిస్థితి మారాలంటే కమ్యూనిస్టులు భూపోరాటంతో పాటు భాషాపోరాటం కూడా చేయాలి. మన ప్రభుత్వం జలయజ్ఞంతో పాటు భాషాయజ్ఞం చేయాలి.** మిగిలిన అన్ని రాజకీయపార్టీలు

**అనేక ప్రజాసంఘాలు భాషాపోరాటం చేయాలి. అవి ఏవి లేకుండా నశించిపోయినప్పుడు కేవలం నిర్వీర్యమైన జాతి వుంటుంది. సంస్కృతే ఉండదు. కేవలం డబ్బు సంస్కృతి ఉంటుంది.** చాలా జాగ్రత్తగా గమనించండి. నీ చేతిలో 10 లక్షలు వున్నాయా రేపటికి లేకుండా చేస్తుంది మన మార్కెట్‌సంస్కృతి.

నీ చేతిలో లక్ష ఉందా, రేపటికి ఉండదు నీ దగ్గర. అందరి జేబుల్ని కొల్లగొట్టడమే ప్రపంచీకరణ మార్కెట్ యొక్క ఉద్దేశ్యం. చూడండి. 4 లక్షలు పెట్టి కారు కొంటావు. 5 వేలు పెట్టి సెల్ కొంటావు. 20 వేలతో కలర్ టి.వి. కొంటావు. ఒకప్పుడు ఇల్లు అంటే తల్లి, తండ్రి, అన్న, తమ్ముడు, అక్క, చెల్లి, బావ, బావమర్ది. ఈరోజు ఇల్లంటే కేవలం వస్తువులే. ఆ కారణంగానే ఇంట్లో పెరిగే పిల్లవాణ్ణి, ఆ పిల్లవాణ్ణి చదివించే చదువును కేవలం మనం వ్యాపారదృష్టితో చూస్తున్నాం. మొన్న 'ఆంధ్రజ్యోతి' చేసిన ఒక సర్వేలో వివరంగా రాశారు. ఒక కుటుంబంలో ఇక పిల్లవాణ్ణి **నర్సరీ స్థాయి నుండి ఇంజనీర్ స్థాయికి,** ఆదనపు కోర్సులతో సహా చదివించడానికి పెట్టుబడులు అన్నీ కలిపి ఎంత అవుతుంది? **25 లక్షలు అవుతోంది.** మీ అందరికి పెళ్లిళ్ళు అవుతాయి. మీ అందరికి పిల్లలు పుడుతారు. మీ పిల్లలందరినీ ఆంగ్లభాషామాధ్యమంలో వేస్తారు. మీ తప్పుకాదిది. అనివార్యంగా దానిలోకి మీరు నెట్టివేయబడుతారు. ఇక అప్పటి నుండి మీ జీవితంలో ఒకే లక్ష్యం. వాడ్ని చదివించడమే. వేరే లక్ష్యం లేదు. తల్లికి పొద్దున లేచినప్పట్నుంచి వాడికి తిండి తినిపించి, టై కట్టి, బూటేయించి, బడిలో విడిచి, మళ్ళీ వాడికి తినిపించి, విడిపించుకొని–ఒక జీవితలక్ష్యమేమీ లేదింక. చూడండి కావాలంటే! ఈ తల్లికి వేరే పనేం లేదు. ఆడపిల్లల్ని 20 లక్షలు ఖర్చుపెట్టి చదివించి, 20 లక్షలు కట్నమిచ్చి పెళ్ళిచేయాలి.

ఒక్క మాతృభాషామాధ్యమాన్ని మనం పూర్తిగా విధ్వంసం చేస్తూ దాని స్థానంలో ఆంగ్లభాషామాధ్యమాన్ని తెచ్చిపెడితే, ఇన్ని భయంకరమైన దుష్ఫలితాలుంటాయి. ఆషామాషీ అనిపిస్తుందా?

మున్ముందు ప్రజాసంఘాలుండవు, ప్రజాబాహుళ్యాలుండవు. ప్రజాపోరాటాలుండవు. రాస్తారోకోలు ఉండవు. ఏమి ఉండక హాయిగా ప్రభుత్వం తన పని తాను చేసుకొంటుంది. దీని వెనుక ఇంత కుట్ర వుంది. అందుకే ప్రభుత్వ పాఠశాలలు ఏ నియమాలతో, ఏ సూత్రాలతో ఏ మాధ్యమంతో పనిచేస్తున్నాయో,అన్ని ప్రైవేటు పాఠశాలలు, కూడా అవే నియమాలతో పనిచేసే విధంగా ఒక్క ఉత్తర్వు ఇవ్వండి. అలా చేయని పాఠశాల గుర్తింపును రద్దు చేయండి.

ఆంగ్లభాషామాధ్యమ పాఠశాలల్లో చదివే పిల్లలు ఎవరికీ తమ మాతృభాష రాదు. ఆంగ్లభాషామాధ్యమ పాఠశాలల్లో పనిచేసే అయ్యవార్లెవరికి ఇంగ్లీషు రాదు. ఇంగ్లీషులో పది వాక్యాలు మాట్లాడమనండి. రాయమనండి.

మీ ఇంట్లో నీ పిల్లవాడ్ని ఉండనివ్వవు. హైదరాబాద్‌లాంటి చోట్ల పడేస్తావు. రెసిడెన్షియల్‌లో 40 వేలు కట్టేస్తావు. ఇంట్లో పిల్లవాడు చదువుకోవడానికి మనం ఇష్టపడం. సమూహం నుండి వేరు చేయడమే మన కుటుంబాల లక్ష్యాలుగా మారిపోతాయి. ఈ తండ్రి పిల్లవాడ్ని చూడడానికి ఇష్టపడడం లేదు. స్కూల్లోనన్నా, ట్యూషన్లోనన్నా వుండాలి. ఇంట్లో హోంవర్క్ రాసి, తినేసి నిద్రపోవాలి. దీని వెనుక భయంకరమైన మార్కెట్ కుట్ర ఉంది.

మనుషుల్ని విడదీస్తే తప్ప, బంధాల్ని తెంచేస్తే తప్ప మార్కెట్ బతకదు. బంధాలు తెంచేస్తే తప్ప ఇంటిని వస్తువులతో నింపలేవు. **మనుషుల మధ్య బంధాన్ని తెంచుకుంటే తప్ప అన్యాయంగా అక్రమంగా డబ్బును సంపాదించలేవు.** ఆర్థిక సరళీకరణ విధానాల వల్ల ఎన్ని పరిణామాలు జరిగాయి. 4 ఇడ్లీలు తినలేని వాడు,రెండు చపాతీలు తినలేని వాడు,లక్షలు సంపాదిస్తున్నాడండీ! ఆశ్చర్యం! వాళ్ల పిల్లలు ఇండియాలో కాదు, ఆమెరికాలో చదవాలి. తెలుగు చదవకూడదు. ఇంగ్లీషు చదవాలి. మాతృభాషామాధ్యమంపై పెత్తనం చేస్తున్న ఆంగ్లభాషామాధ్యమంపై మాత్రమే మాట్లాడుతున్నాను. అది తెలియక ఈ ప్రభుత్వాలు తమ చెట్టును తాను నరుక్కొంటున్నాయండి. ఎన్ని వేల ఉన్నత పాఠశాలల్లో, ఎన్ని లక్షల ఉపాధ్యాయులకు వేల కోట్ల రూపాయలిస్తున్నారు కదా! కొన్ని లక్షల కోట్ల విలువజేసే ఆస్తులు విద్యారంగానికున్నాయి. ఏం సాధిస్తుందీ ప్రభుత్వం?

50 సంవత్సరాల తర్వాత కూడా మనల్ని పరిపాలిస్తున్న ప్రభుత్వానికి భాషావిధానం లేదు. ఒక విద్యావిధానం లేదు. ప్రజాప్రయోజన దృష్టి లేదు. లేకపోవడంవల్లే మనమీ దౌర్భాగ్యస్థితికి ఈనాడు వచ్చాం. పిల్లలంతా ఏమౌతారు. మాతృభాషా మాధ్యమ పాఠశాలలు నాశనమైతే ఊహించుకోవడానికి వీల్లేని భయంకర పరిణామాలు రాబోతున్నాయి. తెలుగు గొప్పది, సంస్కృతి గొప్పది, తెలుగుజాతి గొప్పది అన్నవి ఈ విషయంతోపోలిస్తే చాలా చిన్న అంశాలివి. రాబోయే అనర్థాలను మనం గుర్తించాలిపుడు. అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, భాషాపోరాటం చేసి, మాతృభాషా మాధ్యమాన్ని రక్షించుకోకపోతే వచ్చే తరాలు మనల్ని క్షమించవుగాక క్షమించవు. రక్షించవుగాక రక్షించవు.

**(తిరుపతి భాషోత్సవ సభలో చేసిన ప్రసంగం – 2007 సం॥)**

**– 'మాతృభాషా మాధ్యమమే ఎందుకు?'**
**జనసాహితి ప్రచురణ 2015 నుండి**

# మాతృభాషామాధ్యమాన్నికాపాడుకుందాం!

– సింగమనేని నారాయణ

**'ఆంధ్రప్రదేశ్'** అనే పేరుతో భాషాప్రయుక్తరాష్ట్రమేర్పడి, అంటే భాష పేరుతో రాష్ట్రమేర్పడి – మాతృభాష పేరుతో రాష్ట్రమేర్పడిన 50 సంవత్సరాల తర్వాత – ఆ మాతృభాషనే మృతభాషగా, ఇప్పటి పాలకవర్గాలు మార్చివేయటం ఎంత విషాదం? ఎంత వైరుధ్యం?? భాషల పేరుతో భాషాప్రయుక్తరాష్ట్రాలు ఏర్పడటం వెనుక ఏ మౌలిక భావనలూ లేవా? కేవలం పరిపాలన సౌలభ్యం కోసమే అయితే భాష పేరుతో కాకుండా మరే పేరుతోనైనా రాష్ట్రాలు ఏర్పాటు చేసుకోవచ్చుగదా? అంటే భాషల పేరుతో, రాష్ట్రాల ఏర్పాటు వెనుక ఒక మౌలిక భావన, ఒక మౌలిక ఉద్దేశ్యం అంతర్గతంగా దాగి వుందన్నమాట. మనకు స్వాతంత్ర్యం రాకపూర్వం రెండు శతాబ్దాలపాటు, ఈ దేశాన్ని పాలించిన ఆంగ్లేయుల పాలనలో, ఇక్కడి దేశీయభాషలు అణచివేయబడి, దేశీయ భాషల స్థానంలో ఆంగ్లభాష పెత్తనం కొనసాగిన కారణంగా, మళ్లీ దేశీయభాషలకు ప్రాణం పోయటానికి, దేశీయభాషలను పునరుజ్జీవింపచేయటానికి, భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసుకున్నామన్న మౌలికస్పృహ దాగి ఉండలేదా? ఆ తర్వాత కొనసాగిన విద్యారంగ పరిణామాలు కూడా ఈ విషయాన్ని రుజువు చేసినాయి కదా!

మనకు ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు ఉన్నతవిద్య అంతా కూడా ఆంగ్లభాషా మాధ్యమంలోనే వుండేదన్న విషయాన్ని మనం ఇప్పుడు గుర్తు తెచ్చుకోవాలి. ఇంటర్మీడియెట్, డిగ్రీ ఇలా అన్ని ఉన్నతవిద్యలూ ఆంగ్లభాషామాధ్యమంలోనే కొనసాగేవి. ఉన్నతవిద్య ఆంగ్లభాషా మాధ్యమంలో వుండటం వల్ల జరుగుతున్న అపకారాన్ని గుర్తించి, 1968 తర్వాత ఉన్నతవిద్యనంతా మాతృభాష మాధ్యమంలోకి, ఈ ప్రభుత్వమే మార్చివేసింది. పాఠ్యగ్రంథాలను తెలుగులోనికి మార్చటానికి, "తెలుగు అకాడమీ"పేరుతో ఒక సంస్థనే నెలకొల్పింది. ఆంధ్ర సారస్వతపరిషత్తూ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయంలాంటి సంస్థలన్నీ,మన మాతృభాషను పురుజ్జీవింపచేయటానికే కదా నెలకొల్పుకున్నాము? సాధారణ ప్రజలందరకూ విద్యావకాశాలు మాతృభాషల ద్వారానే సాధ్యమౌతాయని మొదట్లో ఈ ప్రభుత్వం గుర్తించి, ఆ దిశగా ప్రయాణం సాగిందని కూడా జాగ్రత్తగా పరిశీలిస్తే మనం అర్థం చేసుకోవచ్చు.

మరి ఇప్పుడు జరుగుతున్నదేమిటి?

మొత్తం వ్యవహారం తలక్రిందులైపోవటం లేదా?

గతంలో, ఉన్నతవిద్యను మాతృభాషామాధ్యమంలోకి తెచ్చిన **ప్రభుత్వం,ఇప్పుడు పాఠశాలవిద్య నుండీ కూడా ఆంగ్లభాషామాధ్యమాన్ని నెలకొల్ప పూనుకోవటం తలకిందులు వ్యవహారం కాదా? మాతృభాషా మాధ్యమాన్ని కూడా కొనసాగిస్తున్నాం గదా అని మాటవరుసకు ప్రభుత్వం జవాబు చెప్పుకోవచ్చు. ప్రజలను వంచించటానికి గాకపోతే, 6వ తరగతి నుండే ఆంగ్లభాషామాధ్యమం తెచ్చిపెట్టి, క్రమేణా మాతృభాషా మాధ్యమాన్ని గోతిలోకి తోసివేయటానికి చేస్తున్న సన్నాహం కాదా ఇది? గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలను అయోమయంలోకి పడవేయటానికి గాదా ఈ సన్నాహం? ప్రభుత్వమే తనకు తానుగా మాతృభాషామాధ్యమాన్ని నీరసపరచి, ఇంగ్లీషుభాష పట్ల అనవసరపు వ్యామోహాన్ని పెంచటానికి చేస్తున్నది కాదా ఈ సన్నాహం?** ఈ భాషావైపరీత్యాన్ని ఎవరైనా కోరుకున్నారా? దళితులకు, పేదకులాలకు, అంతో ఇంతో అందుతున్న ఈ కొద్దిపాటి చదువులు కూడా అందకుండా చేయటానికి కాదా ఈ కుటిల ప్రయత్నం. ఇంగ్లీషును ఒక పాఠ్యాంశంగా నేర్వటానికే ఆపసోపాలు పడుతూ, దాన్ని గుదిబండలా మోస్తున్న గ్రామీణప్రాంత విద్యార్థులకు, మొత్తం బోధనే ఇంగ్లీషులో జరిపితే, భరించటానికి ఏ విధంగా సాధ్యమవుతుందని అనుకుంటున్నారు? ఎక్కడో నగరాలలో కూచుని, గ్రామీణ ప్రాంత ప్రజల జీవనశైలినీ, కుటుంబ, సామాజికవాతావరణ సంస్కృతినీ, భాషాగత వ్యవహారాల్నీ గమనించకుండా, అర్థం చేసుకోకుండా, దుందుడుకుగా ఆంగ్లభాషా మాధ్యమాన్ని బలవంతంగా నెత్తిన రుద్దితే, ఎంతటి విద్యాసంక్షోభం నెలకొంటుందో ఎప్పుడైనా ఆలోచించారా? ఎంతమంది విద్యార్థులు ఆంగ్లభాషామాధ్యమాన్ని జీర్ణించుకోలేక, మధ్యలోనే చదువును మానివేసే పరిస్థితి ఏర్పడుతోందో గ్రహించలేకపోతున్నారా? దీనివల్ల 'డ్రాపౌట్స్' సంఖ్య పెరిగిపోదా? **మాతృభాషామాధ్యమంలో పాఠ్యాంశాల భావనలూ, సామాజిక, సాంస్కృతికభావనలూ, పిల్లల మెదళ్లలోకి ఎంత సులభంగా ప్రవేశించగలవో, పరాయిభాషామాధ్యమంలో అంత సులువుగా ప్రవేశించలేవన్న కనీసపు జ్ఞానమైనా లేకుండా, ఎవరి ప్రయోజనాలను రక్షించటానికి ఈ అపసవ్యపు భాషావిధానాన్ని ప్రవేశపెడుతున్నారు?**

ఈ సందర్భంలో సుప్రసిద్ధ మేధావి, విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డిగారి మాటలను ఒకసారి గుర్తుకు తెచ్చుకుందాం. ఆయన ఒక వ్యాసంలో ఏమన్నారంటే, "మాతృభాషయందు విద్యగరపుటయే మిక్కిలి

సహజమైన మార్గము... ఆంగ్లదేశమునందు ఆంగ్లేయులకు ఆంగ్లభాషయందును, ఫ్రాన్సు దేశమునందు పరాసు బాలురకు పరాసు భాష యందును విద్యగరపబడుచున్నది గాని యితర భాషలయందు గరపబడుటలేదు. మన ప్రస్తుత విద్యావిధానమునందు అనేక లోపములు గలవు. అందులో మొదటిది, మన బాలురు విషయజ్ఞానములేకయే తమ పాఠములను గ్రుడ్డితనంగా వల్లించి, మెదడులోనికి ఎక్కించుకొనుట! **ఆ పాఠములు పరభాషలో నుండుట వలన బాలురు వానిని జ్ఞాపకముంచుకొనుటకే యత్నించుచున్నారు. కాని తాము చదివెడి పాఠముల యొక్క అర్థమునుగాని, విషయమునుగాని గ్రహించుటకు యత్నించుటలేదు. దీని వలన వారి గ్రహణశక్తి నశించిపోవుచున్నది. జ్ఞానమును అభివృద్ధి చెందించని విద్య నిజమైన విద్య కానేరదు. అటువంటి విద్యావిధానం ఖండనార్హము..." "ప్రజలందరినీ విద్యావంతులను చేయడమనేది మాతృభాషల అభివృద్ధి మీద ఆధారపడి వుంటుందని" గురజాడ వందేళ్ల క్రితమే అన్నాడు.**

ఏ విద్యావిధానమైతే ఖండనార్హమని విద్యావేత్తలంటున్నారో, అటువంటి విద్యా విధానాన్నే మళ్ళీ మన నెత్తిన బలవంతంగా రుద్దటానికి ఇప్పటి ప్రభుత్వాలు ప్రయత్నిస్తుండటం ఎంత అప్రజాస్వామికం? ప్రపంచవ్యాప్తంగా, ఎందరో విద్యావేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, మనస్తత్వశాస్త్రజ్ఞులు, భాషాశాస్త్రజ్ఞులు, నెత్తీనోరు గొట్టుకొని, మాతృభాషలోనే పిల్లలకు చదువు నేర్పాలని ఘోషిస్తుంటే, అందుకు భిన్నంగా పరాయిభాషలో విద్యాబోధనను సాగించటానికి ఇప్పటి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయంటే, ఇంతకు మించిన అంధత్వం మరొకటుంటుందా?

భాష అనేది కేవలం విద్యకు సంబధించింది మాత్రమే కాదు. అది సామాజిక జీవనశైలికి సంబంధించింది కూడా! భాష చుట్టూ ఒక భావజాలం కూడా ఆవరించుకొని వుంటుంది. ప్రజలభాషను ఆవరించుకుని ప్రజాస్వామిక భావజాలం ఉంటుంది. ప్రజాస్వామిక మనుగడకూ, ప్రజాస్వామిక ఆశయాలకు, ప్రజాస్వామిక ఆశయాలకూ, ప్రజాస్వామిక సంస్కృతికీ ప్రజలభాషతో గాఢమైన సంబంధం ముడిపడి ఉంటుంది. ఇక్కడ ప్రజల భాష అంటే మాతృభాషే. పిల్లలు బాల్యం నుండే మాతృభాషకు దూరమైతే, మాతృభాషాబోధనాభ్యాసనానికి దూరమైతే వారు భావజాలపరంగా పరాయికరణకు గురియౌతారు. తమ ప్రాంతపు సహజమైన జీవనసంస్కృతికి, సంప్రదాయాలకూ, ఆచార వ్యవవహారాలకూ, కళలకూ, మానవసంబంధాలకూ, క్రమక్రమంగా దూరమై, **సమూహంలో ఏకాంతాన్ని అనుభవించే దుస్థితికి చేరుకుంటారు.** ఇది ఎంతటి ఘోరవైఫల్యం? చేతులారా కొని తెచ్చుకుంటున్న వినాశనం కాదా ఇది?

అసలు మన ప్రభుత్వానికి, పాఠశాల స్థాయి నుండే ఈ ఆంగ్లభాషా మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలనే దుర్మార్గమయిన ఆలోచన ఎందువల్ల వచ్చింది? **రాష్ట్రంలో ఇప్పుడు పెచ్చు పెరిగిపోయిన, ప్రైవేట్ ఇంగ్లీషు మీడియం స్కూళ్లలోని కుహనా విజయాలను, విద్యాప్రమాణాల విజయంగా భ్రమించి, ఆ ప్రైవేట్ స్కూళ్లదారిలోకి,ప్రభుత్వ పాఠశాలలను కూడా మళ్లించే అవాస్తవిక ధోరణి కాదా ఇది? ఆ ప్రైవేట్ స్కూళ్లు ఇంగ్లీషును "వ్యాపార సరుకు"గా మార్చి, ఇంగ్లీషు పట్ల మిథ్యాభ్రమలను కల్పిస్తూంటే, అవే మిథ్యాభ్రమలలోకి ప్రజలను నెట్టటానికి చేస్తున్న ప్రయత్నం కాదా ఇది?** ప్రభుత్వానికి వాస్తవాలను అర్థం చేసుకోగల శక్తి వుంటే, ఆ ఇంగ్లీష్ ప్రైవేట్ పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమాన్ని ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలి గాని, ఆ పాఠశాలల ఒరవడిని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడమేమిటి? ఇదంతా తలకిందులు వ్యవహారం కాదా?

మారిన పరిస్థితులలో **ఉద్యోగ అవసరాలను, ఇంగ్లీషు భాషే తీరుస్తుందంటూ, అదే పనిగా ఊదరగొడుతున్న మాటల్లోని వాస్తవం, నిజంగా నిజమేనా? ఆ ఉద్యోగ అవసరాల శాతం నిజంగా ఎంత?** నిజంగా సాంకేతికపరమైన ఉద్యోగాలకు, ఇంగ్లీషు అవసరం చాలా తక్కువ. వాటి శాతం కూడా తక్కువే. **అత్యధిక శాతం ఉద్యోగాలు,** ఉదాహరణకు, డ్రైవర్లు, కండక్టర్లు, పోలీసులు, గుమాస్తాలు, హెల్పర్లు, ఉపాధ్యయులు, నర్సులూలాంటి **లక్షలాది ఉద్యోగ అవసరాలను తీర్చటానికి మాతృభాష చాలు.** ఇందుకు ఇంగ్లీషు పండితులు కావాల్సిన అవసరంలేదు. నిజానికి సామాజిక అవసరాలను ప్రధానంగా తీరుస్తున్నవి కూడా ఈ ఉద్యోగాలే కదా? కంప్యూటర్ ఇంజినీర్లు, డాక్టర్లు, ఐ.ఐ.టీ.లూ, ఐ.టి. రంగమూ వీటి శాతం ఎంత? ఈ శాతానికి కూడా కేవలం సాంకేతికపరమైన ఇంగ్లీషు చాలు. వాస్తవం ఇలా వుండగా, **ఇంగ్లీషే లేకపోతే దేశ ప్రగతే లేదు అన్నమాటల్లో ఇంగ్లీషును వ్యాపారసరుకుగా మార్చిన పెట్టుబడిదారుల స్వార్థప్రయోజనాలు తప్ప ప్రజలప్రయోజనాలు ఇమిడి ఉన్నాయా?** భాషగా ఇంగ్లీషును ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. **మనం వ్యతిరేకించాల్సింది, విద్యారంగంలో ఆంగ్లభాషామాధ్యమాన్ని మాత్రమే. కట్టమంచి రామలింగారెడ్డి కూడా ఇదే విషయాన్ని చాల స్పష్టంగా ఇలా చెప్పినారు... "దేశభాషలందు విద్యగరపవలెనని మనము చెప్పినప్పుడు ఆంగ్లభాషను పారదోలుచున్నామని కొంతమంది దురభిప్రాయపడుచున్నారు. ఆంగ్లభాష మిక్కిలి విలువ గలిగిన భాష. దానిని పారదోలుట మా ఉద్దేశ్యం గాదు..."** అందువల్ల మాతృభాషా మాధ్యమాన్ని కాపాడుకోవాలన్నదే మన ఉద్దేశ్యమై వుండాలి. ఆ పనిని నిర్వర్తించాల్సింది మన ప్రభుత్వాలే.

మన ప్రభుత్వం ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం. అందుకే ప్రజాస్వామిక దేశం అంటున్నాం. ప్రజాస్వామిక దేశంలో ప్రజల ప్రయోజనాలను, ప్రజలభాషను కాపాడటం ప్రభుత్వ కర్తవ్యం. ప్రజలందరూ వాళ్ల వాళ్ల మాతృభాషల్లో విద్యాభ్యాసాన్ని కొనసాగించినపుడే, ప్రజాస్వామిక భావజాలం సమాజగతమౌతుంది! పరాయిభాష ద్వారా ప్రజాస్వామిక భావజాలాన్ని ప్రజల మెదళ్లలో నింపటం సాధ్యమేకాదు. అందువల్ల ప్రజాస్వామిక మనుగడకు, ప్రజాస్వామిక ఆశయసాఫల్యానికి మాతృభాష మాధ్యమంలో బోధన, కనీసమైన అవసరంగా ప్రభుత్వాలు భావించాలి.

**(ఎపిటిఎఫ్ ఒంగోలు రాష్ట్ర మహాసభలలో ప్రసంగం)**

2008 ఆగస్టు 'ఉపాధ్యాయ' సౌజన్యంతో

**– 'మాతృభాషా మాధ్యమమే ఎందుకు?'**
**జనసాహితి ప్రచురణ 2015 నుండి**

# సింగమనేని 'మాతృభాషా మాధ్యమమే ఎందుకు?' మొదటి ముద్రణకు ముందుమాట

**గత** 40 ఏళ్ళ తెలుగు సాహిత్యంతో పరిచయం వున్నవారందరికీ మంచి కథా రచయితగా, విశ్లేషకుడిగా అన్నిటికీ మించి గొప్ప ఉపన్యాసకునిగా సింగమనేని నారాయణ చాలామందికి తెలుసు. ఆయన తొలికథ 'జూదం', అలాగే దాశరథి రంగాచార్య నవల 'పావని'పై ఆయన విమర్శనాత్మక విశ్లేషణ 37 ఏళ్ళ క్రితమే 'ప్రజాసాహితి'లో వెలువడ్డాయి. ఈ పుస్తకంలోని మొదటి వ్యాసం 'మాతృభాషే ఎందుకు?' 5 నెలలపాటు 12 ఏళ్ళక్రితం 'ప్రజాసాహితి'లో ప్రచురణయిన తర్వాత 'మాతృభాషే ఎందుకు?' అలాగే 'ప్రజల భాషలో విద్య–పరిపాలన' పుస్తకాలలో ఇప్పటికే ముద్రితమయింది. ఒక విధంగా ఈ ప్రసంగ వ్యాసానికిది 5వ ముద్రణ అవుతుంది.

మిగిలిన 3 వ్యాసాలలో మొదటిది 2007లో తిరుపతిలో జరిగిన సాహిత్య బ్రహ్మోత్సవాలలోని 'విద్యాసదస్సు'లో సింగమనేని చేసిన ప్రసంగమే **మాతృభాషా మాధ్యమమే ఎందుకు?**. అదే సందర్భంలో **'తెలుగు భాష ఉనికి – ప్రగతి; సంక్షోభం – సంఘర్షణ'** అనే కరపత్రాన్ని జనసాహితి విడుదల చేసి మాతృభాషలో విద్య గురించీ, దానికి ఆటంకం కలిగిస్తున్న శక్తుల గురించీ దాని సాధనలో ఎదురవుతున్న పెదధోరణుల గురించీ అందులో చర్చించాము. (చూడండి : **ఈ పుస్తకంలో గల కరపత్రాలు శీర్షికలో!**)

పరాయిభాషామాధ్యమంలో విద్యను తలకిందుల విద్య అంటూ అట్లూరి పురుషోత్తంగారనే ఇంగ్లీషు ఉపాధ్యాయులు 30 ఏళ్ళ క్రితం నుండీ హెచ్చరిస్తూ వ్యాసాలు రాశారు. పుస్తకాలు ప్రచురించారు. కానీ విద్యారంగాన్ని ప్రైవేటువ్యాపారుల ధనార్జన సాధనంగా మార్చదలుచుకున్న ప్రపంచీకరణ బంట్లయిన పరిపాలకులు, విద్యారంగపు సంక్షోభాన్నుండి ఉన్నతవర్గాలను బయటవేయటానికి ఆంగ్లేయ మాధ్యమం చదువులను ప్రోత్సహించి తద్వారా సమాజం మొత్తాన్ని ఇంగ్లీషు మాధ్యమం వేలంవెర్రిలోకి నడిపించారు. మాతృభాషలో విద్యను కూటికి, గుడ్డకు పనికిరానిదనే భావాన్ని అంటురోగంలా వ్యాప్తి చేశారు. గడచిన 30 ఏళ్ళుగా ఇంగ్లీషు మాధ్యమమే దేశాన్ని, ముఖ్యంగా తెలుగుజాతిని ఏలుతోంది.

మాతృభాషామాధ్యమంలో విద్య సెంటిమెంటుకీ, భావోద్వేగాలకు సంబంధించినది కాదు, అదే శాస్త్రీయమైనది. జ్ఞాన సముపార్జనాక్రమానికి అనుసరించవలసిన మార్గమదే. మాతృభాష ద్వారానే పరాయిభాషను (మన సందర్భంలో ఇంగ్లీషుని) బాగా, సులువుగా నేర్వగలుగుతామని సింగమనేనిలాంటి విద్యావంతులూ, జనసాహితి లాంటి సాంస్కృతికోద్యమ శక్తులూ ఎంత బలంగా చెబుతూండినా, పాలక డైనోసార్ల వికృత వికటాట్టహాసాల ముందు సాధుజంతువుల ఆక్రోశంగా మిగిలిపోతోంది.

అయితే చరిత్ర... వాస్తవాలు మేము చెబుతున్నదాన్ని రుజువుపరుస్తున్నాయి. నేటి ఇంగ్లీషు మాధ్యమం చదువులు అటు ఇంగ్లీషూ రాని, ఇటు తెలుగూరాని రెంటికి చెడ్డ రేవళ్ళను పెంచటానికి తప్ప నూతన తరాల భాషాపరిజ్ఞానానికిగానీ, మంచి అభివ్యక్తి (కమ్యూనికేషన్ స్కిల్స్)కిగానీ దోహదపడవని చెబుతున్నవాటికి సాక్ష్యంగా 9.8.2015 నాటి ఈ క్రింది వార్త అక్షరసత్యంగా నిలుస్తుంది.

**"మనోళ్ళది... ఇంగిలిపీసే!**

**– ఆంగ్లంపై పట్టులేని ఇంజనీరింగ్ పట్టభద్రులు**

**– నోరు విప్పితే తత్తత్త... మెమ్మెమ్మె**

**– వందలో ముగ్గురికే ఆంగ్లంపై సాధికారత**

**– సబ్జెక్టుల్లో 99% మార్కులు సాధించినవారూ ఆంగ్లంలో చతికిలే...**

**– మహిళలదీ ఇదే పరిస్థితి"** ('ఆంధ్రజ్యోతి' దినపత్రిక)

'కన్యాశుల్కం' నాటకంలో అగ్నిహోత్రావధాన్లు లాంటివారికి కొన్ని సంస్కృత మంత్రాలు వస్తాయి కానీ వారికి సంస్కృత భాషాసాహిత్యాలతో ఏమాత్రం పరిచయం వుండదు. వారి లోకజ్ఞానం కూడా చాలా వెనుకబడి వుంటుంది. ఏదైనా వుండినా దాన్ని వారు పొందినది మాతృభాష ద్వారానే కాని సంస్కృతం ద్వారా కాదు. కానీ వారంతా ప్రపంచంలోని భాషలన్నిటికీ మూలభాష సంస్కృతమేననే నమ్మకంలో వుంటారు. ఇంచుమించు నేటి ఆంగ్లభాషా వ్యామోహితులు కూడా తెలుగుభాష ద్వారా ప్రపంచజ్ఞానాన్ని ఉన్నతవిద్యను పొందటం అసాధ్యమని భావిస్తారు. ఇంగ్లీషే ప్రపంచపు ఏకైక వైజ్ఞానిక భాష అనుకొంటూ వుంటారు. ఫ్యూడల్ సాంస్కృతిక భావజాలానికి ప్రతీకగా సంస్కృత భాషాదురభిమానం, సామ్రాజ్యవాద సంస్కృతిలో భాగంగా ఇంగ్లీషు వేలంవెర్రి కొనసాగుతున్నాయి. ఇంగ్లీషు మాతృభాష కానివారు ఇంగ్లీషు ద్వారా ఇంగ్లీషుని బాగా నేర్చుకోలేరనీ, వారివారి మాతృభాషల ద్వారానే ఇంగ్లీషును బాగా నేర్వగలుగుతారనీ... ఇదే శాస్త్రీయమైన విద్యా, జ్ఞానసముపార్జనా క్రమమనే స్పృహ కొంతలో కొంత ఇటీవల పెరుగుతోంది.

ఐతే భాషారాజకీయాలలో కూడా 'కులం' కోణం ప్రవేశించి తలకిందుల విద్యావిధానానికి ఊతం యిస్తోంది. పూర్వం ఇంగ్లాండు అమెరికాలకు పోయిన

అగ్రకులాలవాళ్ళూ, ఉన్నత పదవులు పొందినవారూ చాలామంది తెలుగుభాషామాధ్యమంలో హైస్కూలుదాకా చదువుకున్నవారేననే సత్యాన్ని విస్మరించి, ఇటీవల అమెరికా ఉద్యోగాలకు చదువులకు పరుగులిడటానికి ఇంగ్లీషు మాధ్యమం చదువులే కారణమని కొందరు అభిప్రాయపడుతున్నారు. నిజానికి అటు ఇంగ్లీషూరాని, ఇటు తెలుగూరాని రెంటికి చెడ్డ రేవళ్ళుగా మారటంలో అగ్రకుల సంపన్నవర్గాల బిడ్డలు ముందువరుసలోనూ, మధ్యతరగతి, అట్టడుగు దళిత బహుజనులు వెనుకవరుసలోనూ పరుగులు తీస్తున్నారని అర్థం చేసుకోవాలి. ఈ నిచ్చెనమెట్ల అర్థవలస–అర్థఫ్యూడల్ వ్యవస్థలో అగ్రకులాలకుండే బతుకుతెరువు అవకాశాలు బడుగు నిమ్నవర్గాలకెటూ ఉండవు కనుక పేద, బడుగువర్గాలు ఉపాధి దొరకక ఎక్కువ విలవిలలాడుతున్నాయి. నిరుద్యోగసమస్య దీనికి అసలు కారణం. నూతన తరాల వైజ్ఞానిక శక్తియుక్తులను, సృజనను ఆత్మవిశ్వాసాన్ని, వ్యక్తిత్వాలను బలహీనపరచటంలో సమష్టి ఉద్యమ చైతన్యాన్నుండి దూరం చేయటంలో పరభాషామాధ్యమపు చదువులు తమవంతు దుష్టపాత్రను పోషిస్తున్నాయని ఇప్పటికైనా విజ్ఞులు గ్రహిస్తారని ఆశిద్దాం. అందుకు సింగమనేనివారి 'మాతృభాషామాధ్యమమే ఎందుకు' అనే వ్యాసాలు భావస్ఫోరకంగా నిలుస్తాయని భావించి వీటిని వెలువరిస్తున్నాము. వీటిని లోతుగా అధ్యయనం చేయవలసిందిగా పాఠకులను కోరుతున్నాం.

**బెజవాడ**

**11.08.2015** **జనసాహితి**

# సింగమనేని 'మాతృభాషా మాధ్యమమే ఎందుకు?' రెండవ ముద్రణ సందర్భంగా....

**30 - 40** సంవత్సరాల క్రితం కంటె నేడు మాతృభాష గురించిన చర్చ ఎక్కువ జరుగుతోంది. ఉద్దేశ్యపూర్వకంగా చర్చను పక్కదారి పట్టించేవారున్నట్టే అస్పష్టతలతో, ఉద్వేగాలతో చర్చిస్తున్నవారూ వున్నారు. సింగమనేని నారాయణ హేతుబద్ధంగా, శాస్త్రీయచింతనతో పాఠకులకు సులువుగా, ఆసక్తికరంగా వుండేవిధంగా విషయవివరణతో ఈ ప్రసంగవ్యాసాలు అందించారు. ఈ నాలుగు ప్రసంగాలూ (చివరి రచన తప్ప) 2003 – 2007 – 2008 – 2015లలో చేసినవి. వీటి రాజకీయ నేపథ్యం చూస్తే మొదటిదీ చివరిదీ చంద్రబాబునాయుడు అంటే తెలుగుదేశం అధికారంలో ఉండగానూ, నడిమధ్యవి రెండూ రాజశేఖరరెడ్డి (కాంగ్రెసు) అధికారంలో ఉండగానూ చేసినవి. ప్రపంచబ్యాంకు నిర్దేశించిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను ఒకరిని మించి మరొకరు అమలుపరచటంలో భాగంగానే తెలుగుభాషను కూటికీ, గుడ్డకూ పనికిరానిదిగా వీరు మార్చేశారు. లక్షల కోట్ల రూపాయల వ్యాపారరంగంగా 'విద్య'ను తీర్చిదిద్దారు. గడిచిన ముప్ఫైఏళ్లల్లో తెలుగునాట ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్న కోటిమందిలో పట్టుమని 10 మందినైనా మంచి ఇంగ్లీషు సాహిత్యవేత్తలను ఈ విద్యావిధానం సృష్టించలేక పోయింది. నూరేళ్ళక్రితం ఆంగ్లవిద్యలో నిష్ణాతులైనప్పటికీ త్రిపురనేని రామస్వామి, ఉన్నవ లక్ష్మీనారాయణలాంటివారు తెలుగు సాహితీవేత్తలుగా ప్రసిద్ధులవటానికి కారణం, మాతృభాషకుండే సృజనాత్మక శక్తియే. కట్టమంచి రామలింగారెడ్డికుండిన ఇంగ్లీషు పాండిత్యాన్ని గురించి నేటికీ చెప్పేవారున్నారు. కానీ ఆనాడే, ఆయన మాతృభాష యొక్క విశిష్టతను చెప్పటమేకాక, అది ఇంగ్లీషును నిరాకరించేది కాదని కూడా వక్కాణించినట్లు ఈ వ్యాసాలలో సింగమనేని ఉల్లేఖించారు.

నిజానికి ఏ భాషా మరొకభాషకు వ్యతిరేకమయినది కాకపోగా రెంటినీ, అవి పరస్పరం మెరుగులు దిద్దుకుంటాయి. అయితే మాతృభాష ద్వారా పొందే జ్ఞానం తరగని ఫిక్సెడ్ డిపాజిట్ (మూలధనం) లాంటిది. దాని ద్వారా పొందే వడ్డీ లేక లాభం అంటే పరాయిభాష ద్వారా పొందే పరిజ్ఞానం ఒకవైపు వినిమయానికి ఉపయోగపడుతూనే అంతకు అంతా మూలధనంలోకి వచ్చి చేరుతుంది. అంటే ఆంగ్లభాష ద్వారా పొందిన పరిజ్ఞానమంతా మాతృభాష ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని పెంపొందిస్తూ వుంటుంది. వాడుతున్నకొద్దీ కత్తి పదునెక్కినట్లుగా, వినిమయిస్తున్నకొద్దీ భాష ద్వారా మానవ విజ్ఞానం అపారంగా అభివృద్ధి చెందుతుంది. ఇంగ్లీషు మాధ్యమం ద్వారానే ఆ పరిజ్ఞానాన్ని పొందవచ్చును కదా, అనేవారుంటారు. మాతృభాషను నేర్వటంలో మాట్లాడటంలో ఎంత సహజత్వం వుందో, అదే పరాయిభాషలో ఎలాంటి అసహజమైన బట్టీ చదువులతత్వం వుందో ఈ వ్యాసాల ద్వారా మీరు బాగా తెలుసుకోగలుగుతారు.

ప్రాథమికవిద్య నుండి కళాశాలవిద్యకు ఎవరూ గెంతరు. మెట్టుమెట్టుగా చదువుకునేట్టు విద్యావిధానం నిర్ణయమవుతుంది. కారణం? నిన్న పొందిన జ్ఞానం మీద ఆధారపడి నేడు నేర్వాలి. తెలిసిన విషయ పరిజ్ఞానం నుండి తెలియని కొత్త అంశాలు నేర్చుకోవాలి. అలాగే తెలిసిన మాతృభాష ద్వారా, తెలియని పరాయిభాషను సులువుగా, బాగా నేర్వగలుగుతాము. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలన్నీ ఈ పద్ధతి విద్యావిధానాన్నే అనుసరిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి కూడా మాతృభాషలలో బోధనను కొనసాగించమని సూచిస్తోంది.

1982లో, అప్పటికింకా తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడక ముందు, చంద్రబాబు నాయుడు కాంగ్రెసు మంత్రిగా వున్న కాలంలో, తిరుపతిలో ఒక మహానాడు జరిగింది. అందులో తెలుగుదేశం పార్టీ, తాను అధికారంలోకి వస్తే, ప్రాథమిక, మాధ్యమిక విద్యయే కాదు కళాశాలల, విశ్వవిద్యాలయాలలో బోధన అంతా తెలుగుభాష ద్వారా నేర్పుతామని ఒక విస్పష్టమైన తీర్మానం చేశారు. ఎన్టీఆర్ తదనంతర పాలకులు ఆ తీర్మానాన్ని చించి చెత్తబుట్టలో పారేసి విద్యావ్యాపారులకు లొంగిపోయారు. తల్లకిందుల విద్యావిధానాన్ని – ఇంగ్లీషు మాధ్యమం చదువుల్ని – క్రమేణా ప్రాథమిక విద్యనుండే కాదు, అంగన్‌వాడీల నుండి మొదలిడుతున్నారు. ఈ కృత్రిమ విద్యావిధానం వల్ల తెలుగుభాష ఒక్కటే కాదు, ఇంగ్లీషుభాష కూడా రావటంలేదు. గడిచిన 30 ఏళ్ళుగా అటు ఇంగ్లీషూ సరిగా రాని, ఇటు తెలుగు అసలే రాని తరాలను సృష్టించారు. దీని వెనకాల ప్రపంచీకరణ కుట్రలున్నాయని సింగమనేని ఈ వ్యాసాలలో స్పష్టం చేస్తారు. కనీసం పరిపాలన కూడా ప్రజలభాషలో చేయని స్వతంత్ర దేశాలెక్కడైనా వున్నాయా?

సింగమనేని నారాయణ జనసాహితి రాష్ట్ర కార్యవర్గంలో కొంతకాలం వున్నారు. గడిచిన 40 ఏళ్ళుగా మా నిర్వహణలోని 'ప్రజాసాహితి' పత్రికలో కథలు, సమీక్షలూ రాస్తూ వున్నారు. "మాతృభాషలో విద్య – పరిపాలన" అన్న జనసాహితి అవగాహనను ప్రజలలోకి విస్తారంగా తీసుకువెడుతున్నారు.

"మాతృభాషే ఎందుకు" అన్నవారి తొలి ప్రసంగ వ్యాసాన్ని 'ప్రజాసాహితి'లో ప్రచురించటమేకాక, అదే శీర్షికతో ఇంకా యితర వ్యాసాలను కూడా కలిపి ఒక పుస్తకంగా ఆనాడే వెలువరించాము. రెండు సంవత్సరాల క్రితం గిడుగు రామమూర్తి 162వ జయంతి సందర్భంగా ఈ పుస్తకం మొదటి ముద్రణ వెలువడింది. ఈ నెల (29-8-2017) ఆయన 164వ జయంతినాటికి అందుబాటులోకి వచ్చేవిధంగా రెండవ ముద్రణను అందిస్తున్నాము.

పాలకులు కూడా గిడుగు రామమూర్తి జయంతిని అడ్డుపెట్టుకుని భాషాభిమానులను బురిడీ కొట్టించే వాగ్దానాలు గుప్పిస్తూనే, మునిసిపల్ బడులలో యిక తెలుగు మాధ్యమం చదువులు లేకుండా చేసేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు. అందుకే నేడు మనమున్నది "ఆంగ్లప్రదేశ్"లోననీ, మనల్ని ఏలుతున్నది 'తెలుగు ద్వేషం' పార్టీ అని మేమంటున్నాము. మేమన్నది తప్పయితే దాన్ని రుజువు పరుచుకోవాల్సిన బాధ్యత పరిపాలకులదేనని మళ్ళీ.... మళ్ళీ చెబుతున్నాము.

**బెజవాడ**

**20.08.2017** **జనసాహితి**